జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php






సంపుటి 16 సంచిక 137 విశాఖపట్నం మంగళవారం 09 జనవరి 2024 8 పేజీలు వెల : 5.00



# లోక్ సభ సైరన్!

## ఏపీ, తెలంగాణల్లో వ్యూహాలు

అనధికారికంగా లోక్ సభ ఎన్నికల సైరన్ మోగింది. ఏపీ, తెలంగాణల్లో అన్ని రాజకీయ పార్టీలు రెడీ అవుతున్నాయి. ఇక ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే సై అంటున్నాయి. అప్పడే జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పార్లమెంటు నియోజకవర్గాల సమన్వయ కర్తల బాధ్యతలను తమ నాయకులకు అప్పగించాయి. ఇక తెలంగాణలో బీఆర్ఎస్, ఏపీలో వైసీపీ, టీడీపీ ఎంపీ అభ్యర్థుల ఎంపికలో కసరత్తులు పారంభించాయి. తెలంగాణలో ఎట్టి పరిస్తితిలో బలాన్ని పెంచుకోవాలని కాంగ్రెస్, బీజేపీ తలమునకల్లో తేలుతున్నాయి. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ పార్టీ నియోకవర్గాల్లో పార్టీ బలోపేత బాధ్యతలను మంత్రులకు అప్పగించింది. 17 నియోజకవర్గాల్లోనూ విజయం సాధించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్.. తదితరులకు పార్లమెంట్ స్థానాల బాధ్యతలను అప్పగించారు. ఇక పోటీ చేసే అభ్యర్థుల ఎంపికే ఆలస్యం.

### వ్యూహాత్మక ఎత్తుగడల్లో బీఆర్ఎస్..

ఇటీవల ఎన్నికల్లో అధికారాన్ని చేజార్చుకున్న బీఆర్ఎస్ ఇక లోక్: సభ ఎన్నికల్లో కదం తొక్కటానికి సన్నద్ధమవుతోంది. అనారోగ్యంతో విశ్రాంతి తీసుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫిబ్రవరిలో ప్రజల ముందుకు వస్తారు. ఈ లోపు పార్లమెంటు స్థానాల్లో అభ్యర్థులను పార్టీ అగ్రనేతలు కేటీఆర్, హరీష్రావు, కవిత.. తదితరులు పార్టీ నేతలతో సమీక్షలు జరుపుతున్నారు. నిజమాబాద్ ఎంపీ స్థానంలో ఎవరు పోటీ చేయాలనే అంశంపై సోమవారం సమీక్ష జరిపారు. కొత్త అభ్యర్థిని రంగంలోకి దించితే ఎలా ఉంటుందనే అశంపై చర్చ జరిగింది. పార్టీ నేతలు మాత్రం కవితను రంగంలోకి దించాలని అభ్యర్థించారు. ఇలా పార్లమెంటు నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ కూలంకషంగా చర్చిస్తోంది.

### బీజేపీ కసరత్తు..

తెలంగాణలో ఓటు బ్యాంకును పెంచుకున్న బీజేపీ లోక్ సభ ఎన్నికల్లో మరింత బలాన్ని పెంచుకోవాలని వ్యూహ రచన చేసింది. అంతర్గత కుమ్ములాటలను పక్కన పెట్టి అందరూ కలిసికట్టుగా పని చేయాలని బీజేపీ అగ్రనేత అమిత్ షా పిలుపు మేరకు బీజేపీలో మార్పులు వచ్చాయి. తాజాగా నియోజకవర్గాల ఇన్ చార్జ్లను బీజేపీ అధిష్టానం ప్రకటించింది. ఆదిలాబాద్ : పాయల్ శంకర్ (ఎమ్మెల్యే), పెద్దపల్లి : రామారావు పవార్ (ఎమ్మెల్యే), కరీంనగర్ : ధన్పాల్ స్సూర్య నారాయణ గుప్త (ఎమ్మెల్యే), నిజామాబాద్ : ఆలేటి మహేశ్వర్ రెడ్డి (ఎమ్మెల్యే), జహీరాబాద్ : వెంకట రమణ రెడ్డి (ఎమ్మెల్యే), మెదక్ : పాల్వాయి హరీష్ బాబు (ఎమ్మెల్యే), మల్కాజ్ గిరి : పైడి రాకేష్ రెడ్డి, (ఎమ్మెల్యే), సికింద్రాబాద్ : కె.లక్ష్మణ్ (ఎంపీ), హైదరాబాద్ : టి.రాజా సింగ్ (ఎమెల్యే), చేవెళ్ల : వెంకట నారాయణ రెడ్డి (ఎమ్మెల్యే), మహబూబ్ నగర్ : ఎన్.రామ చందర్ రెడ్డి (మాజీ ఎమ్మెల్సీ), నాగర్ కర్నూల్ : మారం రంగారెడ్డి (మాజీ ఎమ్మెల్సీ), నల్గొండ : చింతల రామచంద్ర రెడ్డి (మాజీ ఎమ్మెల్యే), భువనగిరి : ఎన్ ఎస్ ఎస్ ప్రభాకరరావు ( మాజీ ఎమ్మెల్సీ ), వరంగల్ : మర్రి శశిధర్ రెడ్డి ( మాజీ మంత్రి ), మహబూబా బాద్ : గరికపాటి మోహన్ రావు (మాజీ ఎంపీ), ఖమ్మం : పొంగలేటి సుధాకర్ రెడ్డి (మాజీ ఎమ్మెల్సీ) నియమించించింది. వీరందరూ తమ పార్లమెంటు నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతమే కాదు, అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని బీజేపీ ఆదేశించింది.

### అభ్యర్థుల వేటలో పార్టీలు..

లోక్ సభ ఎన్నికలకు అధికార వైసీపీ, ఉమ్మడి ప్రతిపక్షం టీడీపీ, జనసేన కసరత్తులు ప్రారంభించాయి. అనేక మంది సిట్టింగ్ ఎంపీలను వైసీపీ పక్కన పెడుతోంది. కొందరు ఎంపీలను ఎమ్మెల్యే బరిలోకి

- అన్ని పార్టీలు ముమ్మర కసరత్తు
- కాంగ్రెస్, బీజేపీ సన్నద్ధం
- అభ్యర్థులను రెడీ చేస్తున్న బీఆర్ఎస్
- ఏపీలోనూ ఇదే పరిస్థితి
- తెలుగుదేశంలో సీట్ల గలాట
- వైసీపీ సిట్టింగులలో అలజడి

దించుతోంది. విశాఖపట్నం ఎంపీని విశాఖ తూర్పు అసెంబ్లీ స్థానంలోనూ, రాజమండ్రి ఎంపీని అసెంబ్లీ స్థానంలోనూ దించగా.. ఏలూరు ఎంపీ పోటీ చేయనని ప్రకటించారు. నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణం రాజు ఏనాడో పార్టీకి దూరమయ్యారు. బందరు ఎంపీ బాలశౌరికి సీటు ఇస్తారో లేదో తేలలేదు. గుంటూరులో పోటీ చేయాలని లావు కృష్ణదేవ రాయలను కోరారు. కానీ ఆయన వ్యతిరేకించారు. నర్సారావు పేటలోనే పోటీ చేస్తానని భీష్మించారు. ఇలా మార్పులు, చేర్పుల్లో వైసీపీ గుంపులు, చింపులు పడుతోంది.

### టీడీపీలోనూ గలాట..


జనసేన పొత్తుతో ఏపీలో అధికారంలోకి వస్తామని టీడీపీ గంపెడాశతో ఉంది. కానీ లోక్ సభ స్థానాల నిర్ణయంలో అష్టకష్టాలు పడుతోంది. ఏపీలో ముగ్గురు ఎంపీలు ఉంటే.. ఇద్దరు దూరమయ్యారు. విజయవాడ ఎంపీ కేశినేని నానిని పార్టీ పక్కన పెట్టింది. గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ తనకు తానుగా వైదొలిగారు. ఇక జనసేనతో పొత్తు కుదిరింది. రెండు సీట్లు జనసేనకు ఇవ్వటానికి టీడీపీ అంగీకరించింది. బీజేపీతో పొత్తుపై మీమాంశ తెగలేదు. బీజేపీ ఇప్పటికే 10 ఎంపీ సీట్లు అడుగుతోంది. ఏతావాతా టీడీపీ మిత్ర పక్షం ఇంకా సీట్ల సర్దుబాటులోనే ఉంది.





# ఆల్ తెలుగు ప్రజాపార్టీకి సంపూర్ణ మద్దతు

## సర్వోదయ ఉద్యమ నేత ప్రసాద్ గొల్లనపల్లి



హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి): సమాజహితం కోసం ఏర్పాటై, ప్రజల ముందుకు వస్తున్న ఆల్ తెలుగు ప్రజాపార్టీ కి తమ సంపూర్ణ సహకారం ఉంటుందని సర్వోదయ ఉద్యమ నేత ప్రసాద్ గొల్లనపల్లి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా సమాజ సేవ చేస్తున్న డాక్టర్ కటికల శివ భాగ్యారావు వంటి వారి ఆధ్వర్యంలో ఈ నూతన రాజకీయ పార్టీ ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని, మద్యం రహిత రాష్ట్రాన్ని చూడాలనుకున్న తమ కల ఆల్ తెలుగు ప్రజాపార్టీ ద్వారా నెరవేరబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయాలలో ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని, అవినీతి రహిత, కల్తీ లేని, కాలుష్యం లేని, కుల మత విభేదాలు లేని ఒక సమసమాజాన్ని నిర్మించడానికి, సుపరిపాలన అందించడానికి, సర్వ శ్రేయస్సు కోరుతున్న ఈ నూతన రాజకీయ పార్టీ కి తమ పూర్తి మద్దత్తు ఉంటుందని,గత యాభై ఏళ్లుగా సర్వోదయ ఉద్యమంలో గాంధేయ వాదంతో పనిచేసిన అనుభవంతో ఇప్పుడున్న పరిస్థితులలో తాను ఈ పార్టీ ఏర్పాటు కావడం శుభతరుణం,అత్యంత ఆవశ్యకం అని భావిస్తున్నానన్నారు. ప్రజలు ప్రజాస్వామ్యం లో కీలక పాత్ర వహించి ప్రజాప్రతినిధులను ఎన్నుకొని, సరైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొని ప్రజా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.ప్రజాస్వామ్యానికి ప్రజలే పునాది అని, అలాంటి వ్యక్తి నిర్మాణం, సమాజ నిర్మాణానికి అత్యంత కీలకమని అందుకోసం కృషి చేస్తున్న శివ భాగ్యారావు ప్రయత్నం అభినందనీయమన్నారు. ఈ నూతన రాజకీయ పార్టీ ద్వారా గాంధేయ విలువలతో కూడిన సమసమాజం, గ్రామీణాభివృద్ధి కోసం గ్రామ స్వరాజ్ విధానంలో పనిచేయడానికి సిద్ధమని , వికేంద్రీకృత ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు కోసం కృషి చేస్తున్న డాక్టర్ కటికల శివ భాగ్యారావు వెంట ప్రజలందరు నడవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఓటరు జాబితాలో సవరణకు ప్రత్యేక చర్యలు: ముకేశ్ కుమార్ మీనా

### నిబంధనలు ఉల్లంఘించిన 24 మంది బీఎల్వోపై చర్యలు



విజయవాడ : రాబోయే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటర్ల తుది జాబితా తయారీకి 2023 డిసెంబర్ 9 వరకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించామని ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా వెల్లడించారు. ఇవాళ ఆయన విజయవాడలో మీడియాలో మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో సవరణలు చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించామని తెలిపారు. ఓటరు నమోదుకు కొత్తగా వచ్చిన దరఖాస్తులను జనవరి 12లోపు క్లియర్ చేస్తామని వెల్లడించారు. ఇప్పటికే మరణించిన ఓటర్లు, డూప్లికేట్లు, ఓటు బదిలీ దరఖాస్తులను బీఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహించి పరిష్కరించారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు 5,64,819 పేర్లను అనర్హులుగా గుర్తించామని అన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో భారీ సంఖ్యలో ఆన్లైన్లో దరఖాస్తులు చేస్తున్నారంటూ తమకు కంప్లయింట్లు అందాయని తెలిపారు. కాకినాడ నగరంలో ఫాం–7 ద్వారా గంపగుత్తగా ఓటర్లను చేరుస్తున్న 13 మంది, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో దురుద్దేశ పూర్వకంగా దాఖలు చేసిన ఆరుగురిపై కేసులు నమోదు చేశామని వెల్లడించారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఐపీసీ, ఐటీ చట్టాల కింద కేసులు పెట్టామని. అదేవిధంగా నిబంధనలు ఉల్లంఘించిన 24 మంది బీఎల్వోపై చర్యలు తీసుకున్నామని తెలిపారు.

# ఏపీకి చెందిన సహకార సంఘానికి ప్రధాని ప్రశంస..

న్యూఢిల్లీ, : ఆంధ్రప్రదేశ్లో ఓ వ్యవసాయ సహకార సంఘం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు అందుకుంది. సోమవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన ప్రధాని, ఏపీలోని నంధ్యాలకు చెందిన ఖ్వాజా మోహియుద్దీన్తో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే 1921లో ఏర్పడిన ఆ సహకార సంఘంలో పనిచేస్తున్న మొహియుద్దీన్.. తమ పనితీరు గురించి ప్రధానికి వివరించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో తమకు నాబార్డు ద్వారా వ్యవసాయ మౌలిక వసతుల కోసం రూ. 3 కోట్ల రుణం అందిందని, ఆ డబ్బుతో తాము అత్యాధునిక సదుపాయాలతో 5 గోదాములు నిర్మించామని మొహియుద్దీన్ చెప్పారు.రైతులు తమ పంటలను ఈ గోదాముల్లో నిల్వ చేసుకుంటారని, ఎలక్ట్రానిక్ నెగోషియబుల్ వేర్హౌజ్ రసీదులు అందిస్తున్నామని తెలిపారు. ఆ రసీదులను ష్యూరిటీగా పెట్టుకుని బ్యాంకులు రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తున్నాయని వివరించారు. అలాగే గోదాముల్లో నిల్వ చేసిన రైతుల పంట దిగుబడిని దేశంలో డిమాండ్ ఉన్న ప్రాంతాలకు ఎగుమతి చేసి మెరుగైన ధరలు రైతులకు అందజేస్తున్నామని తెలిపారు.



ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఈ–నామ్', 'ఈ–మండీ' వ్యవస్థలను ఉపయోగించుకుని ఆయా పంటలకు దేశంలో ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడ విక్రయిస్తున్నామని వెల్లడించారు.తద్వారా మధ్యవర్తులు, దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి రైతులకు నేరుగా ప్రయోజనం కల్పిస్తున్నామని అన్నారు. తమ సహకార సంఘంలో రైతులు, మహిళా రైతులతో పాటు చిరువ్యాపారులు కూడా ఉన్నారని, మొత్తం కలిపి 5,600 మంది సభ్యులని ఖ్వాజా మొహియుద్దీన్ తెలిపారు. ప్రభుత్వం అందజేసే సదుపాయాలను మెరుగ్గా వినియోగించుకుంటూ రైతులకు మంచి ధర అందించేలా చూస్తున్న సహకార సంఘాన్ని ప్రధాని మెచ్చుకున్నారు. ఈ తరహా వినూత్న ఆలోచనలతో ముందుకెళ్లాలని సూచించారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ సహకారం, అండదండలు ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మొహియుద్దీన్ గురించి కూడా ప్రధాని చెప్పారు.


## స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

SNEHA MACS — SNEHA CLUB

(Regd. No.AMC/VSP/DCO/2008/2446 Dated 07-03-2008)

SNEHA GROUP OF ORGANISATIONS — SNEHA CLUB 23 YEARS CELEBRATIONS

BENEFITS

- Safe and confidential
- High rate of Interest On Deposits
- No Income Tax deduction on Interest Payment
- Financial growth to all
- Support Your Business
- Easy Sanction of loan to share holders
- Dividend paid to the Share holders (since 10 Years)

Schedule of Interest Rates on Fixed & R.D.Accounts

| Term | | General | Senior Citizens |
|---|---|---|---|
| 91 Days | - 179 Days | 8.25% | 8.75% |
| 180 Days | - 1 Year | 9.25% | 9.75% |
| 1Year | - 2 Years | 10.25% | 10.50% |
| 2 Years | - 3 Years | 10.50% | 10.75% |
| 3 Years | - 5 Years | 11.00% | 11.50% |
| Above 5 Years | | 12.00% | 12.50% |
| Saving Bank A/C | | 5.00% | 5.00% |
| Recurring deposit | | 6.00% | 6.50% |

Money Multiplier Scheme

Your valuable money is Double in 7 Years

Minimum 10,000/- and above

SPS

సంవత్సరానికి11.00%వడ్డీ ఇవ్వబడును. మీ డిపాజిట్ పై లభించే వడ్డీ

| | |
|---|---|
| రూ. 1,00,000/- | రూ. 11,000/- |
| రూ. 5,00,000/- | రూ. 55.000/- |
| రూ. 10,00,000/- | రూ. 1,10,000/- |

*షరతులు వర్తిస్తాయి

ఆంధ్రప్రదేశ్ : విశాఖపట్నం : 0891-2791205,9246663046,7660027696 చింతలపూడి : 7660027675

తెలంగాణ : హైదరాబాద్ : 040-23233989, 7660027682 పొన్నూరు : 9618444604

ఆంధ్రప్రదేశ్ : డోర్.నెం.50-61-3, సీతంపేట, రాజేంద్రనగర్, విశాఖపట్నం-530016

తెలంగాణ : డోర్.నెం. 6-29÷3,మూడవ అంతస్తు , దౌలత్ప్లాజ, లక్డీకాపూల్, హైదరాబాద్-500 004.

E-mail:snehamacsltd@gmail.com



విజయవాడ పుస్తక మహోత్సవము ముగింపు సందర్భంగా ,స్నేహ గ్రూపు ఏర్పాటు చేసిన 58వ స్థాల్ను ను క్రాంతి లాల్ దండే ఐఏఎస్ వారుసందర్శించి ,నేటి సమాజంలో బహుజన సాహిత్యం అవసరత ఉన్నదని, ప్రధానంగా యువత బహుజన సాహిత్యం పై అవగాహన పొంది, బహుజన నాయకుల రచించిన పుస్తకాలను చదివి మహనీయుల త్యాగాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని కోరినారు. ఈ సందర్భంగా వారు స్టాల్ నందలి కొన్ని బహుజన పుస్తకాలను తీసుకొనుట జరిగినది. కార్యక్రమంలో , విజయవాడ పట్టణంలోని బహుజన రచయితలు పాల్గొన్నారు., మాస్టర్ కి టీవీ బాపట్ల కంటెంట్ ఓనర్ గురజాల శ్రీనివాసరావు రచయిత ఎర్ర సత్యనారాయణ పాల్గొన్నారు

## బాపట్ల ఎంపీ రేసులో మాజీ ఐఆర్ఎస్ దగ్గుమల్లి ప్రసాదరావు





బాపట్ల జిల్లా ప్రజపాలన జనవరి 8: బాపట్ల ఎంపీ రేసు లో మాజీ ఐఆర్ఎస్ దగ్గుమల్లి ప్రసాదరావు పోటీ చేస్తారు అని జిల్లా లో గట్టిగా వినబడుతుంది. బాపట్ల ఎంపి స్థానం పై సీటు ఎవరికి ఇస్తారో ఎదురు చూస్తున్నారు ఏ పార్టీ అయినా సరే ఎంపీ టికెట్ ఈ సారి స్థానిక స్థానికంగా ఉన్న వ్యక్తులు కి పార్లమెంటు సీటు కేటాయించాలని నాయకులు, కార్యకర్తలు అన్ని పార్టీల అదినాయకులను బలంగా డిమాండ్ చేస్తున్నారని విశ్లేషకులు తెలుపుతున్నారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులపై చర్చలు, ఊహాగానాలు జోరుగా కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా బాపట్ల పార్లమెంటు అభ్యర్థిగా ఎంపి సీటు ఎవరికి కేటాయిస్తారు అనే అంశంపై తర్జనభర్జనులు పడుతున్నారని తెలుస్తుంది. వివిధ సామాజిక వర్గాల ఆలోచనలను నాయకులు పరిగణనలోకి తీసుకోవాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. తెలుగుదేశం పార్టీ తరపున బాపట్ల ఎంపి సీటుకు జిల్లా కి చెందినా చింతగుంపల గ్రామవాసి మాజీ ఐఆర్ఎస్ దగ్గుమళ్ళ ప్రసాద రావు పేరు బలంగా వినిపిస్తుంది.బాపట్లతో పాటుగా చీరాల,పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలలో కూడా వివిధ రాజకీయ నాయకుల, అన్ని సామాజిక వర్గాలకు అనుకూలంగా ఉండి తమ కష్టసుఖాలలో తోడుగా నిలిచి విద్యా, ఆరోగ్య విషయాలలో ఎందరో పేదలకు ఇప్పటికే స్వచ్ఛందంగా ఎన్నో సేవాకార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా వారి అభిమానాన్ని చూరగొన్న ఉన్నత విద్యావంతుడు, సమర్థుడు అయిన ప్రసాదరావు రాజకీయ రంగ ప్రవేశం పట్ల ప్రజలు పార్టీల కతీతంగా తమ ఆసక్తిని చూపుతున్నారు. ఎన్జీవో అసోసియేషన్స్ తో చర్చించి తమ సమస్యల పరిష్కారానికి చొరవచూపిస్తున్న వీరు తమ సొంత జిల్లా కు చెందిన వ్యక్తి కావడం,ఆర్థిక రంగ నిపుణులుగా విశేష పేరు ప్రఖ్యాతులు కలిగి ఉండటం, వివిధ దేశాల ఆర్థిక రంగ పురోభివృద్ధిని నిశితంగా పరిశీలించడమే కాక, బడ్జెట్ కేటాయింపు తీరుతెన్నులపై వివిధ చర్చా కార్యక్రమాలలో పాల్గొని విశ్లేషించడమే కాక,ఆర్థిక అంశాలపై విస్తృత అధ్యయనం చేసిఉన్నారు. దగ్గుమల్లి ప్రసాదరావు విశేష అనుభవం కలిగిన తమ స్థానిక సమస్యలపై సరియైన అవగాహనతో స్పందించి తమ వాణిని పార్లమెంట్ లో వినిపించ గల సత్తా ఉన్న వ్యక్తి ఆయన కొత్త జిల్లాగా మారిన తమ ప్రాంతానికి ఎంతో మేలు చేకూరుతుందని ప్రజలు బలంగా నమ్ముతున్నారు.ఆయన తెలుగుదేశం పార్టీ తరపున ఎంపీ అభ్యర్థిగా పోటీచేసినట్లయితే ప్రస్తుత వైసీపీ అభిమానులు,గ్రామ,మండల ,జిల్లాస్థాయి నాయకులు కూడా తాము తెలుగుదేశం పార్టీలో చేరతామని, ఆయనను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని అనేకమంది ఆయనను కలిసి తమ మద్దతును తెలియజేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలియవచ్చిన సమాచారం.మరి పార్టీ అధినేతలు ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

## టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

నూజివీడు, జనవరి 08, ప్రజాపాలన ప్రతినిధి: స్వర్గీయ రామినేని నారాయణస్వామి మనుమడు స్థానిక న్యాయవాది రామినేని రామకృష్ణ ఆర్థిక సహకారంతో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుతున్న 244 మంది విద్యార్థినిలకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వారిచే రూపొందించబడిన పదవ తరగతి స్టడీ మెటీరియల్ ను విద్యార్థులకు సోమవారం అందజేసారు. ఈ సందర్భంగా విద్యార్థినిలను ఉద్దేశించి రామకృష్ణ మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో చదివి మంచి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆయన కోరారు. స్టడీ మెటీరియల్ రూపొందించిన యుటిఎఫ్ వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ చిన్న వయసులోనే విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న రామకృష్ణ దాతృత్వాన్ని కొనియాడారు. భవిష్యత్ లో ఇలాంటి మరెన్నో సేవ కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవివి సత్యనారాయణ, యుటిఎఫ్ జిల్లా సహా అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బత్తుల అనురాధ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబురావు, చెన్నకేశవరావు, జిల్లా కౌన్సిలర్ బి శ్రీనివాసరావు, సభ్యులు నాగమల్లేశ్వరరావు, రఘుబాబు, బాలకోటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# పులిచింతల నిర్వాసితులకు "పట్టా"భిషేకం

**18 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపిన మంత్రి అంబటి**



రాజుపాలెం ప్రజాపాలన ప్రతినిధి: దేశ సౌభాగ్యం కోసం నిర్మించే సాగునీటి ప్రాజెక్టులలో నిర్వాసితులదే ముఖ్య భాగస్వామ్యమని, వారికి ప్రభుత్వాలు అన్ని సౌకర్యాలు కల్పించినా, నివాస స్థలాల హక్కు, రిజిస్ట్రేషన్ కల్పించడమే కీలకమని రాష్ట్ర జల వనరుల శాఖ మాత్యులు అంబటి రాంబాబు అన్నారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన కేఎల్ రావు సాగర్ (పులిచింతల) నిర్వాసితులకు ఇళ్ల పట్టాల జీవో లో భాగంగా జరిగిన సోమవారం" రిజిస్ట్రేషన్ పత్రాల " కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి పులిచింతల డిప్యూటీ కలెక్టర్ వసంత బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి దార్శనికతతో పులిచింతల నిర్మాణం పురుడు పోసుకుందన్నారు. రిజర్వాయర్ ప్రాంతంలో మునిగిపోయిన గ్రామాలను సత్తెనపల్లి పెదకూరపాడు పిడుగురాళ్ల ప్రాంతాల్లోని 12 కాలనీలో 5,376 నివాసాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వీరందరికీ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. తద్వారా ప్రభుత్వానికి సుమారు రూ. 50 కోట్ల భారం పడుతుందని వివరించారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కోల్పోయినా పేద ప్రజలకు ఉచితంగా హక్కు పత్రాలను అందించాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆలోచించారని వివరించారు. ఆర్ అండ్ ఆర్ సెంటర్లో గత 18 ఏళ్లుగా నివాసిత హక్కుల సమస్య పరిష్కారానికి చాలా రోజులగా ప్రయత్నం చేశామన్నారు. అదృష్టవశాత్తు జలవనరుల శాఖామంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో మీ కల సహకారం చేయగలిగామన్నారు .నా నియోజకవర్గంలో నా ఓటర్లకు నా శాఖ ద్వారా న్యాయం చేయటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. హక్కు పత్రాల ద్వారా మీ నివాసాలకు విలువ, మీకు ఆత్మ గౌరవం దొరుకుతుందన్నారు. ఈ ప్రభుత్వం ద్వారా మీకు మేలు జరిగిందని నమ్మి విశ్వసిస్తేనే మాకు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. అనంతరం జెసి శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో 50 మందికి ముందుగా లిఉచితంగా రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలనులి పంపిణీ చేశారు. కార్యక్రమములో పులిచింతల మరో డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు, ఆర్డిఓ రాజకుమారి తహసీల్దార్ నలిని, నియోజవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, మండల పార్టీ కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, జడ్పిటిసి సభ్యురాలు దొంతి రెడ్డి సునీత రెడ్డి,మండల నాయకులు మర్రి సుబ్బారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పలువురు ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు.

## జనసేనపార్టీ నేత రావూరి బాలాజీ ఆధ్వర్యంలో కాపు సేవా ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

**కాపు సేవా ట్రస్ట్ అల్పాహార విందు కార్యక్రమానికి విశేష స్పందన**

**భవన నిర్మాణ, అసంఘటిత కార్మికులకు అల్పాహార విందు**



చీరాల, జనవరి 08, ప్రజాపాలన : జనసేన పార్టీ నేత రావూరి బాలాజీ ఆధ్వర్యంలో, కొనసాగుతున్న కాపు సేవా ట్రస్ట్ సామాజిక సేవలు ప్రశంసనీయమని, నేటి యువతకు స్ఫూర్తి దాయకమని చీరాల ప్రజలు అభినందిస్తున్నారు. స్వర్గీయ రావూరి వెంకటసుబ్బయ్య, మీనాక్షమ్మ ల జ్ఞాపకార్థం, చీరాల కాపు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో, శ్రీమతి డొక్కా సీతమ్మ స్ఫూర్తి తో, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకనుగుణంగా, నిరంతరం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాలలో భాగంగా, వరుసగా ఆరో సోమ వారం చీరాల భవన నిర్మాణ, అసంఘటిత కార్మిక శ్రేణులకు, మున్సిపల్ పరిధిలోని, 6 వ వార్డు మాజీ కౌన్సిలర్ పేగు దారం దాసు ఇంటి వద్ద, వినాయకుడి గుడి దగ్గర రజక బజార్ నందు, నిర్వహించిన అల్పాహార విందు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ట్రస్ట్ వ్యవస్థాపకులు రావూరి వెంకటేశ్వర్లు, కోటేశ్వరమ్మ ల నిర్వహణలో, జన సేన పార్టీ నేత రావూరి బాలాజీ ఆధ్వర్యం లో నిర్వహించిన, జనసైనికుల సమిష్టి కృషితో, భవన నిర్మాణ కార్మికులకు, ప్రజ లకు ఏర్పాటు చేసిన అల్పాహార విందు కార్యక్రమం విజయవంతమైంది.పెద్దసంఖ్యలో హాజరైన భవన నిర్మాణకార్మికులకు, ఎటువంటి ఇబ్బందులు లేకుండా, నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. కాపు సేవా ట్రస్ట్ సేవలను ప్రశంసిస్తూ, ట్రస్ట్ నిర్వాహకులను, జన సైనికులను, ప్రజ లు అభినందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రావూరి బాలాజీ, బూడిద వరం, బాసి పైడి రెడ్డి, కాటం గారి బ్రహ్మయ్య, షేక్ భాషా, వంగవల్లి భాగ్యలక్ష్మి, జి.కాళికా, కారంపూడి పద్మిని, వీర మహిళలు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## చీరాల నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే బలరామ్ సుడి గాలి పర్యటన



చీరాల, జనవరి 08, ప్రజాపాలన : చీరాల నియోజకవర్గ వ్యాప్తంగా, చీరాల మున్సిపల్, మండల పరిధిలలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సుడిగాలి పర్యటన చేశారు. చీరాల మండ లం జాండ్రపేట పరిధిలో, నిత్యావసర వస్తువుల బియ్యం పంపిణీ వాహనాన్ని,ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి ఆకస్మికంగా సందర్శించారు. ప్రజలకు అందుతున్న సరుకులు సక్రమంగా అందుతున్నాయో, లేదో అని ప్రజల్ని అడిగి తెలుసుకున్నా రు. చీరాల మునిసిపల్ 31వ వార్డు పరిధిలోని, చిన్నపిల్లల పార్క్ అభివృద్ధి పనులను పరిశీలించారు. మసీదు సెంటర్ నందు జరుగుతున్న డ్రైనేజీ, సిమెంట్ రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలించి, అధి కారులకు పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. చీరాల మండలం జాండ్రపేట పరిధిలో దేవాంగ భవనం స్థలాన్ని, ఎమ్మెల్యే బలరామ్ పరిశీలించారు. చీరాల మండలం తోటవారి పాలెం పంపింగ్ స్కీం పరిధిలో ఉన్న, పంట పొలాల కోసం నీరు, 10 రోజుల పాటు 24 గంట ల ఉచిత కరెంట్ కోసం, రైతులు ఆశ్ర యించగా, ఎమ్మెల్యే స్పందించి వెంటనే అధికారులతో మాట్లాడి, నీరు, 10 రోజుల పాటు ఉచిత కరెంట్ ఇవ్వమని అధికారు లకు ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ సహకారంతో, ఎన్ ఎస్ కె ఎఫ్ డీసీ పథకం క్రింద, మంజూరు చేసిన సెప్టిక్ ట్యాంక్ వాహనాలను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఆయా కార్యక్ర మాలలో ఆర్.డి.ఓ. సరోజినీ, ఎస్. సి. కార్పొరేషన్ ఈ.డి.అ ర్జున్ నాయక్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్ బాబు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు తదితర వైసిపి నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ని సత్కరించిన అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్



బాపట్ల జిల్లా ప్రజపాలన జనవరి 8: పేదలకు అండగా నిలుస్తున్న అఖండ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. సోమవారం బపట్ల జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ ను అఖండ ఫౌండేషన్ సభ్యులు కలిసి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అఖండ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలను ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ ఎస్పీ వకుల్ జిందాల్ కు వివరించారు. ఆపదలో ఉన్న వారిని గుర్తించి ప్రతి నెలా తమ వంతు చేయూతనిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే బాపట్ల జిల్లాలో ఫౌండేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, వీటిని మరింత విస్తృతం చేస్తామని వివరించారు. అనంతరం ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు మరింత ముందుకు తీసుకెళ్లాలని ఎస్పీ సూచించారు. తొలుత ఫౌండేషన్ సభ్యులు ఎస్పీ వకుల్ జిందాల్ ను శాలువా, మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ ఆడిటర్ చాపల సుబ్రమణ్యం, అఖండ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వంగపాటి శివ, సభ్యులు చేజర్ల సతీష్, పులిగడ్డ శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు మల్లవరం గ్రామంలోని జగనన్న పట్టాల పంపిణీ



గోకవరం ప్రజాపాలన జనవరి 8: గోకవరం మండలంలోని మల్లవరం గ్రామంలో జగనన్న ఇళ్ల స్థలాలు 294 మంజూరు చేసిన శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు కు గ్రామ ప్రజలు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు జగనన్న ఇళ్ల స్థలాల పట్టాలు, మరియు స్థలాలు ఇవ్వడం జరిగిందని గ్రామస్తులు తెలియజేశారు. జగనన్న ప్రభుత్వం సమక్షంలో ఎంతో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని దీనికి కారకులైనటువంటి శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు కృషి ఎంతో ఉందని తెలిపారు. నిలువ నీడలేని నిరుపేదలకు జగనన్న ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి నిరుపేదలకు ఎంతో మేలు చేశారని, ఇటువంటి నాయకుడు మళ్లీ ముఖ్యమంత్రిగా వచ్చి మాలాంటి పేద ప్రజలందరినీ మరింత అభివృద్ధిలోనికి తీసుకురావడానికి ఆయనే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకుడు, కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి పైల కళ్యాణ్, మరియు మాజీ ఎంపీటీసీ, సచివాలయాల కన్వీనర్, సీరందాస్ రాజు, వైయస్సార్సీపి ఎస్సీ సెల్ జిల్లా నెంబర్ కాపారపు రాజేష్, మరియు వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు మద్దతు తెలిపిన డాక్టర్ రాజ్యలక్ష్మి



నరసాపురం, జనవరి 8 (ప్రజాపాలన ప్రతినిధి) : తమ డిమాండ్ల పరిష్కారం కొరకు అంగన్వాడి ఉద్యోగులు గత 28రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సమ్మెలో భాగంగా స్థానిక అంబేద్కర్ సెంటర్లో అంగన్వాడీ ఉద్యోగులు నిర్వహిస్తున్న నిరసన శిబిరంలో సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, పశ్చిమ గోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి సంఘీభావంగా పాల్గొని అంగన్వాడీలకు తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా గత జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల మేరకు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ ఉద్యోగులు, వర్కర్లు రాష్ట్రవ్యాప్తంగా గత 28 రోజులుగా సమ్మె బాట పట్టి తమ నిరసన వ్యక్తం చేస్తున్నా ముఖ్యమంత్రి జగన్ స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. తక్షణమే విధులలో చేరాలని అంగన్వాడీలను హెచ్చరిస్తూ ప్రభుత్వం ఎస్మా జీవో జారీ చేయడం దుర్మార్గ చర్యని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించి వారికి తగిన న్యాయం చేయాలని ఈ సందర్భంగా డాక్టర్ రాజ్యలక్ష్మి డిమాండ్ చేశారు.

## కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు

నరసాపురం, జనవరి 8 (ప్రజాపాలన ప్రతినిధి): నరసాపురం యునైటెడ్



కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక టేలరు హైస్కూలులో సోమవారం సంక్రాంతి సంబరాలను సంస్కృతి సాంప్రదాయాలతో అత్యంత వేడుకగా ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ముగ్గుల పోటీలు, సాంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. భోగి మంటలతో, హరిదాసుల కీర్తనలు, బొమ్మల కొలువులు, గొబ్బెమ్మలతో కన్నుల పండుగగా సంక్రాంతి పండుగ వేడుకలను నిర్వహించారు. ముగ్గుల పోటీలు, సాంప్రదాయ వస్త్రధారణ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. ఈ సంక్రాంతి వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, పశ్చిమగోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు, కాపు వనిత క్లబ్ రీజనల్ చైర్ పర్సన్ డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ మన సంస్కృతిలో ప్రధాన భాగమని అన్నారు. విద్యార్థిని విద్యార్థులకు భోగి మంటలు, బొమ్మల కొలువులు, ముగ్గుల యొక్క ప్రాధాన్యత, విశిష్టతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ కాపు వనిత క్లబ్ ప్రెసిడెంట్ పుప్పాల ఉమామహేశ్వరి, సెక్రటరీ బండి నాగవెంకట స్వర్ణలత, ట్రెజరర్ రంగినీడి భరణి, వైస్ ప్రెసిడెంట్ పుప్పాల ఉషా కమల, సభ్యులు పుప్పాల శశికళ, సుంకర రాజ కుమారి, గంటా వెంకటరమణ, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## బాబు షూరిటీ భవిష్యత్తు కు గ్యారంటీ



కారంపూడి... జనవరి08...ప్రజాపాలన... ప్రతినిధి :మండలం లోని ఇనుపరాజుపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ కు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ జిల్లా యువత అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్,టీడీపీ నాయకులు కార్యకర్తలు.

## వై.యస్. పాలెంలో సంక్రాంతి సంబరాలు



నరసాపురం, జనవరి 8 (ప్రజాపాలన ప్రతినిధి) :నరసాపురం మండలం యర్రంశెట్టివారి పాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలను భోగిమంటలు, గంగిరెద్దు, హరిదాసు సంకీర్తనలు, రంగవల్లులతో అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ సంక్రాంతి వేడుకల కార్యక్రమంలో యర్రంశెట్టివారి పాలెం గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి నాగ ముత్యమాంబ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ యర్రంశెట్టి త్రినాధ వెంకట నరసింహారావు (బాబులు) ముఖ్య అతిథులుగా పాల్గొని ముగ్గుల పోటీలు, కోలాటం, వివిధ ఆటల పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోలపర్తి శ్రీనివాస్, సుబ్బారావు, సెక్రటరీ వైవి సత్యనారాయణ, కె. రఘురాం, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నేడు గుడ్లవల్లేరులో కేంద్రమంత్రి శ్రీపాద నాయక్ వికసిత యాత్ర




ప్రజాపాలన ప్రతినిధి, గుడ్లవల్లేరు : వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర పర్యాటక శాఖామాత్యులు శ్రీపాద యస్సో నాయక్ మంగళవారం గుడ్లవల్లేరు విచ్చేస్తున్న సందర్భముగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాంపౌండ్ లో జరిగే బహిరంగ సభ నిర్వహించనున్నామని గుడ్లవల్లేరు ఎండిఓ డి. శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం మండల అధికారులు ఎంఆర్వో రెహ్మాన్ మస్తాన్, విద్యుత్ శాఖ ఎఇ సుబ్బారెడ్డి, ఎఇ శివాజీ, ఇఓపిఆర్డి దిలీప్ కుమార్, ఎస్ఐ శ్రీనివాస్, పంచాయతీ ఇఓలు నరసింహారావు, రమేష్, ఎలీష, పారిశుధ్య అధికారి వాణీకుమార్ తదితరులు సభా ఏర్పాట్లను సమీక్షించారు. ప్రతినిధులు, ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరై సభను జయ ప్రదం చేయాలని ఎండిఓ కోరారు.

## ఘనంగా జాతీయ యువజన ఉత్సవాలు



మైదుకూరు ప్రజాపాలన ప్రతినిధి: జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని మైదుకూరు మండలం "శెట్టి వారిపల్లె" జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు స్వామి వివేకానంద చిత్రపటమానికి పూలమాల సమర్పించి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు "అహల్యా భాయ్" మాట్లాడుతూనరేంద్రనాథ్ దత్త నుండి స్వామి వివేకానంద మారి భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దశదిశలా చాటిన స్వామీ వివేకానంద జన్మించిన జనవరి 12న భారతీయులు ప్రతీ సంవత్సరం జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటరని, ఈ దేశ యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తిదాయకమని అంతేకాకుండా పాశ్చాత్య దేశాలలో అడుగుపెట్టిన మొట్టమొదటి హిందూ సన్యాసి స్వామి వివేకానందనే అని ఆమె అన్నారు.పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల కాంపిటీషన్ నిర్వహించి బహుమతులను అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జనవిజ్ఞానిక కడప జిల్లా సాంస్కృతిక కన్వీనర్ ఖాజా హుస్సేన్, గంజికుంట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఈశ్వరమ్మ, దీప్తి, వాగ్దాడం శివశంకర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## శేరీ కల్వపూడి స్కూల్లో ముగ్గుల పోటీలు



ప్రజాపాలన ప్రతినిధి, గుడ్లవల్లేరు : విద్యార్థులు జీవనవిధానం లో అన్ని నేర్చుకోవాలని అప్పుడే వారి ప్రతిభ బయట పడుతుందని ప్రధా నోపాధ్యాయులు జి.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. సోమవారం పాఠశాల లోని విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు.పోటీలలో ప్రధమ కుందేటి రషిత శ్రీ ద్వితీయ యం. శ్రేష్ఠ తృతీయ చోరగుడి రేణుక లకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్. లక్ష్మీ కుమారి, స్వర్ణకుమారి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జగ్గయ్య చెరువును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతా: తంగెళ్ళ



పిఠాపురం ప్రజాపాలన ప్రతినిధి: పిఠాపురం టౌన్ జగ్గయ్య చెరువులో ఆదివారం జనసేన పార్టీ యొక్క ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చి కూరాకుల అరవింద్, పోలిశెట్టి చంద్రశేఖర్, గుంట్ర తేజ, గాదె కోటేశ్వరరావు, గూన ప్రసాద్ల ఆధ్వర్యంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ సమక్షంలో సుమారుగా 300 మంది ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలోకి జాయిన్ అయ్యారు. జనసేన పార్టీ ఇంచార్జ్ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ అందరికీ జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తొలుత జగ్గయ్య చెరువు పశువుల ఆసుపత్రి నుంచి జగ్గయ్య చెరువులో ఏర్పాటు చేసిన సభావేదిక వరకు ర్యాలీగా వెళ్ళారు. ఈ ర్యాలీలో మహిళలు దారి పోడవునా హారతులు ఇచ్చి తమ మద్దతూ తెలుపుతూ ఆశీర్వదించారు. ఈ సంధర్భంగా ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇక్కడ పరిస్థితి చూసి తన మనసు చలించివేసిందని... జగ్గయ్య చెరువుని దత్తత తీసుకుని, స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతానన్నారు. వైసిపి అనేది మునిగిపోతున్న నావ అని... అది అందరికీ తెలిసిందని అందుకే ఆ పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు కూడా ఇప్పుడు జనసేనలోకి జాయిన్ అవుతున్నారన్నారు. జనసేన మరియు తెలుగుదేశం శ్రేణులు కష్టపడి పనిచేసి, ఈ దోపిడీ రాజ్యాన్ని, దొంగ ప్రభుత్వాన్ని తరిమి తరిమి కొట్టి మన రెండు పార్టీల ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని.... ఏర్పాటు చేయడం తధ్యమని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుడైన ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట జనవరి 8 ప్రజాపాలన ప్రతినిధి సుదీర్ఘకాలంగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో పట్టణంలో ఎక్కడ వ్యర్థాలు అ క్కడ నిలిచిపోయిన నేపథ్యంలో గ్రహించిన ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పారిశుద్ధ కార్మికుడై పట్ట ణంలోని విలియంపేట ఏరియాలో ఉన్నటువంటి చెత్తను తొలగించారుఈ సందర్భంగా ఉదయభాను మా ట్లాడుతూ మున్సిపల్ కార్మికుల జీతాల విషయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి న వెంటనే 18 వేల నుండి 21 వేల రూపాయలు చేశా రని మీ న్యాయమైన కోరికలను ప్రభుత్వం పరిశీలి స్తుందని అన్నారు. మున్సిపల్ కార్మికులు ప్రజా ఆరో గ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మానవతా దృక్పథంతో సమ్మెను విరమించాలని కోరారు. కరోనా కష్టకాలంలో మీరు చేసిన సేవలు మరువలేనివి అన్నారు. కార్మికు ల న్యాయమైన కోరికలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నం దున్న ట్రేడ్ యూనియన్ల వారు కూడా సమ్మె విరమిం పచేసేలా చేయాలని కోరారు. కార్మికుల సమ్మె మూ లంగా పారిశుధ్య పరిస్థితి విపరీతంగా ఉండడంతో ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమం చే పట్టడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప ట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యక ర్తలు, అభిమానులు పాల్గొన్నారు

## గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు



నందిగామ జనవరి 8 ప్రజాపాలన ప్రతినిధి మండల పరిధిలోని లింగాలపాడు గ్రామంలో గడపగడపకు మ న ప్రభుత్వ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే జగన్మోహ న్ నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాల క్యాలెండర్ను వారికి అందజేశారు ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూప్రతి ఇంటికి వచ్చి పథకాలు అందించే వాలంటీర్లు కావాలా ??.ఇళ్ల చుట్టూ తిప్పుకునే జన్మభూమి కమిటీలు కావాలా అన్నారు. జగనన్న పాలనలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రాజకీయాలకు, కుల, మతాలకు అతీతంగా పథకాలు అందుతున్నాయని.. ప్రభుత్వం నియమించిన వాలం టీర్లే ప్రతి ఇంటికి వెళ్లి అర్హులను గుర్తించి పథకాలకు ఎంపిక చేస్తున్నారని.. జగనన్న నేరుగా బటన్ నొక్కి మహిళల బ్యాంకు ఖాతాల్లోనే సంక్షేమ పథకాల డ బ్బులు జమ చేస్తున్నారని చెప్పారు. కానీ తెలుగుదే శం పార్టీ పాలనలో సంక్షేమ పథకాలు కావాలంటే.. టి డిపి నాయకుల ఇళ్ల చుట్టూ చెప్పులు అరిగేలా, నెల ల పాటు తిప్పుకొని, వారి ఇళ్ల ముందు, కార్యాలయా ల దగ్గర పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. జన్మభూమి కమిటీల లంచాలు, దోపిడీ ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని ఏదైనా పథకానికి అర్హత పొందాలంటే ముందుగా జ న్మభూమి కమిటీల సభ్యులైన తెలుగుదేశం పార్టీ వా రికి లంచాలు ఇవ్వనిదే పని చేసేవారు కాదని.. ఆ విధానానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ స్వస్తిపలికి.. వాలంటీర్లను నియమించారన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వా లంటీర్లు, తదితరులు పాల్గొన్నారు

## ఆధునికరించబడిన సొసైటీ భవనాన్ని నూతన క్యాష్ కౌంటర్ ను ప్రారంభించినఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



నందిగామ జనవరి 8 ప్రజా పాలన ప్రతినిధి పట్టణం లో కేడీసీసీబీ నిధులు రూ.9 లక్షల అంచనా వ్యయం తో ఆధునికరించబడిన ప్రాథమిక వ్యవసాయ పర పతి సంఘం యొక్క భవనాన్ని మరియు అదనపు కౌంటర్లను శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు సోమవారం ప్రారంభించారుఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో సహకార సంఘాలు మరింత బలోపేతమయ్యాయని.. రైతుల సంక్షేమం, అభివృద్ధికి జగనన్న ఎనలేని కృషి చేస్తు న్నారన్నారు. గత 5 ఏళ్ల క్రితం నందిగామ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం రూ.10 కోట్ల టర్నోవర్ లో ఉందని.. ఈ నాలుగేళ్లలో రూ.19 కోట్ల టర్నోవర్ ను సాధించిందని.. 5 ఏళ్ళ క్రితం రూ.40 లక్షల అప్పుతో కొనసాగిన సొసైటీ.. నేడు రూ.39 లక్షల ఆదాయంతో లాభాల బాటలో నడుస్తుంద న్నా రు. కమర్షియల్ బ్యాంకులతో పోటీపడుతూ కేడిసిసి బి రుణాలను అందిస్తుందని.. కేవలం రైతులకే కా కుండా కర్షక మిత్రా, యల్.టి, విద్యా, వ్యాపార రుణా లను తక్కువ వడ్డీకే ఇతరత్రా రుణ సదుపాయాలను కల్పిస్తుందని.. అందరూ కేడీసీసీబీ సేవలను సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు వ్యవ సాయ సొసైటీలు పుట్టినిల్లుగా సేవలందిస్తున్నాయ ని.. సహకార సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. నందిగామ వ్యవసాయ ప రపతి సంఘం భవనాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దిన సొసైటీ చైర్మన్ పాములపాటి రమేష్ ని, సిబ్బంది ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్, మాజీ సొసైటీ అధ్యక్షులు, డైరెక్టర్ లు, మున్సిపల్ వైస్ చైర్మ న్, పలువురు రైతులు, మేనేజర్, సీఈవో తదితరులు పాల్గొన్నారు

## వైసిపి పాలనలో గ్రామాలను పూర్తిగా నిర్వీరం చేశారు: టిడిపి ఇన్-చార్జి వెనిగండ్ల



గుడివాడ : బాబు ష్యూరిటి భవిషత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం నందివాడ మండలం చినలింగాలలో గడప గడపకు తెలుగు దేశం పార్టీ కార్యక్రమాన్ని మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్లతో కలసి నియోజకవర్గ ఇన్చార్జి వెనిగండ్ల రాము నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు దారుణ పరిస్థితులలో కనీస మౌలిక వసతులు లేక తీవ్ర అవస్థలు పడుతునరన్నారు. జగన్రెడ్డి పాలన ఆటవిక రాజ్యాన్ని తలపిస్తుందన్నారు. చంద్రబాబు మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటునరన్నారు. ఈ కార్యక్రమంలో నియోజికవర్గ సర్పంచ్ ల సంఘం అద్యక్షులు కాకరాల సురేష్, చినలింగాల సర్పంచ్ దాసం రాంబాబు, మండల అధ్యక్షులు ధానేటి సన్యాసిరావు, నాయకులు చాట్రగడ్డ రవి, కొలకలేటి భవానీప్రసాద్, అరెకపూడి రామశాస్త్రి, తాతినేని మురళి, మద్దాలి ఇసాక్, కొల్లి రమ్య, కొల్లి పెదబాబు, సాల్మన్ రాజు, కె.సతీష్, రమణ, ఎస్.శ్రీను, సింగాల రాధాకృష్ణ, ఏసుపాదం, కొల్లి సుధాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దశాబ్దాల కల.., నెరవేరిన వేళ..



చీరాల, జనవరి 08, ప్రజాపాలన : దశాబ్దాల కల..,నెరవేరినవేళ.., ఎమ్మెల్యే బలరామ్ చేతుల మీదుగా పట్టాలు అందుకొన్న లబ్ధిదారులు ఆనందంతో, హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఊహించలేదయ్యా.., కనీసం నువ్వన్నా ఇస్తావని అంటూ, ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలుపుతూ, మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. చీరాల ఎన్. ఆర్. అండ్ పి.యం.హైస్కూల్ ఆవరణ లోని ఓపెన్ ఎయిర్ థియేటర్ లో జరిగిన, సి.జె.ఎఫ్.ఎస్. అసైన్మెంట్ భూముల పట్టాలు, చీరాల మునిసిపాలిటీలో ఇళ్ళ పట్టాల పంపిణీ కా ర్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని, వైసీపీ నేతలు,అధికారులతో కలిసి పట్టాలు పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామ్ మాట్లాడు తూ, ఏళ్ల తరబడి సమస్యగా ఉన్న అసైన్మెంట్ భూములకు, నేడు పట్టాలు పంపిణీ చేయ డం ఎంతో ఆనందంగా ఉందని, మొత్తంగా 194 మంది లబ్ధిదారులకు పట్టాలు నేడు పంపిణీ చేయడం, ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆర్ డి ఓ సరోజినీ, తహసీల్దార్ ప్రభాకరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఇ డి అర్జున్ నాయక్, వైస్ చైర్మ న్లు బొనిగల జైసన్ బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాస రావు, వైసిపి చీరాల మండల అధ్యక్షులు ఆసాది అంకాళ రెడ్డి, రాష్ట్ర మహి ళా జాయింట్ సెక్రటరీ మల్లెల లలితరాజశేఖర్, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు చీమకుర్తి బాలకృష్ణ, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు సల్లూరి అనిల్, జిల్లా కార్యదర్శి శిఖా సురేష్, బండారు శివపార్వతి, పట్టణ వైస్ ప్రెసిడెంట్ మొగిలి బాబ్జీ, బత్తుల అనిల్, కంపా అరుణ్, గుం టూరు ప్రభాకరరావు, కలవకూరి యానాదిరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, బుర్ల మురళి, ఎస్టీ సెల్ నల్లబోతుల రాజ్ కుమార్, పి ఎ సి ఎస్ చైర్మన్ బోయిన కేశవులు, పృధ్వీ ధనుంజయ, గుంటూరు వెంకట సుబ్బారావు, గుమ్మడి చిన్న బాబు, పర్వతనేని శ్రీనివాసరావు, షేక్ ఆజాద్, చావలి వాసు, షేక్ మస్తాన్, దుడ్డు మా ర్క్, బక్కా శివప్రసాద్రెడ్డి, గుర్రం బుజ్జి, తదితర నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన జ్యోతుల నెహ్రూ



గోకవరం ప్రజా పాలన జనవరి 7: మండలంలోని రంప యర్రం పాలెం గ్రామానికి చెందిన ఉంగరాల బోడ్డియ్య కుమారుడు కాశి ఇటీవలే రోడ్డుప్రమాదంలో కాలికి గాయమైంది. ఆయనను అదే గ్రామానికి చెందిన నవనాసి వెంకటేష్ ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. వారిని పలకరించి ఆరోగ్య విషయాలు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ. అదే గ్రామానికి చెందిన పప్పు మాణిక్యం, బాహుబలేంద్రని సీతారాం, దర్శిపూడి సత్యభామ ఇటీవలే మరణించడంతో వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, ఉంగరాల రాము, బాదంపూడి ప్రకాష్, ఉంగరాల గణేష్, నారా ప్రసాద్, నవనాసి గణపతి, యర్ర రాంబాబు, చీకట్ల శ్రీను, నోట్ల నూకరాజు, గంటా చంద్ర రావు, ఆది రవి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **Yelugubanti Veera Venkata Sandeep Kumar,** R/o D.No.9-1, Gokavaram (V&MDL), E.G District, hereby state that my Father's name is in my SSC Certificate was recorded as DURGA PRASAD and in Adhaar Card & Bank A/c it was recorded as **KANAKA DURGA RAO**. Now his name is changed to KANAKA DURGA RAO for all purposes

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

మంగళవారం 09, జనవరి 2024

## ఆదాయంలో పేద, ఎన్నికల ఖర్చులో సంపన్నం!

జార?ండ్, ఒడిషా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహుకు సంబంధించిన ఆస్తులపై ఇటీవల ఆదాయ పన్ను శాఖ చేసిన దాడుల్లో కళ్లు చెదిరే స్థాయిలో నోట్ల కట్టలు పట్టుబడ్డాయి. రూ.350కోట్లు దొరికినట్లు సమాచారం. టీవీ ఛానెళ్లలో యథావిధిగా పార్టీల మధ్య పరస్పర ఆరోపణల యుద్ధం జరిగింది. రాజకీయ ఎదురుదాడుల్ని అలా ఉంచితే, భారతదేశంలో ఎన్నికలకు, లెక్కచెప్పని వేల కోట్ల రూపాయల నగదుకు మధ్య విడదీయలేని బంధం ఉందనేది జగమెరిగిన సంగతి. ఇటీవల నిర్వహించిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల్లో అత్యధికులు సగటున రూ.25%--%30 కోట్లు ఖర్చు పెట్టినట్లు అంచనా. బరిలో ఉన్న మూడు ప్రధాన పార్టీల ఖర్చునూ లెక్కేస్తే, మొత్తం నియోజకవర్గ స్థాయి ఎన్నికల ఖర్చు సుమారు రూ.10,000కోట్లు. 17 లోక్‌సభ స్థానాలున్న ఒక చిన్న రాష్ట్రంలో ఇది దిగ్భ్రాంతి కలిగించే మొత్తం. దీంతోపాటు, ప్రకటనలు, స్టార్ నేతల ప్రచారానికి ప్రధాన పార్టీలు బోలెడు డబ్బు వెచ్చించాయి. చట్టబద్ధ కార్యకలాపాలకి పార్టీలకు డబ్బు అవసరం. కానీ నిజమైన సమస్య, ఎన్నికల ప్రచారాలకి, పార్టీని సంస్థాగతంగా నడపటానికయ్యే చట్టబద్ధ ఖర్చు కాదు. మన రాజకీయ ప్రక్రియలో చట్టవిరుద్ధ నిధుల సమీకరణకు అంతం లేదు. చాలా రాష్ట్రాల్లో ఎన్నికల్లో చేసే ఖర్చులో చాలా మేర డబ్బుతో, బహుమతులు, మద్యం వంటి ఇతర ప్రలోభాలతో ఓటరుకు లంచం ఇవ్వటానికే అవుతోంది. కేరళ మినహాయించి అన్ని దక్షిణాది రాష్ట్రాలలో చట్టవిరుద్ధమైన, లెక్కలు చెప్పని భారీస్థాయి వ్యయం నియమంలా మారింది. మిగిలిన చాలా రాష్ట్రాల్లోకి కూడా ఈ తీరు వ్యాపిస్తోంది. ఓటరును ప్రలోభపెట్టటం ఉన్నకొద్దీ సర్వసాధారణమవుతోంది. దీనర్థం, డబ్బుతో మీరు ఓటర్లని కొనగలరని కాదుబీ బరిలో ఉన్నట్లు, పోటీలో పరిగణనలోకి తీసుకోదగిన అభ్యర్థిగా అనిపించుకునేందుకు భరోసాకి మాత్రమే ఓటర్లకు డబ్బు పంపిణీ పనికొస్తుంది. ఇంకా చెప్పాలంటే, ఎన్నికల్లో పోటీకి డబ్బు పంపిణీ ప్రవేశ రుసుములా తయారైంది. ఓటర్లపై చేసే భారీ ఖర్చు గెలుపుకి గ్యారంటీ కాదుబీ కానీ ఖర్చు పెట్టకపోతే ఓటమి మాత్రం దాదాపు గ్యారంటీ. ఈశాన్య రాష్ట్రాల, జమ్మూ కశ్మీర్ ఓటర్లు కూడా ఎన్నికల సమయంలో పెద్ద మొత్తంలో డబ్బు ఆశిస్తున్నారు. ఓట్ల కొనుగోలు చట్టవిరుద్ధం, ఓటర్లకు లంచమిచ్చే అభ్యర్థి, పార్టీ కార్యకర్తలు, ఆ డబ్బు తీసుకునే ఓటర్లు కూడా నేరానికి పాల్పడుతున్నట్లు లెక్క. కానీ పాతుకుపోయిన రాజకీయ సంస్కృతిలో అది భాగమైనప్పుడు చట్టం, ప్రాసిక్యూషన్ ద్వారా నియంత్రించటం అసాధ్యం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో, చాలా రాష్ట్రాల్లోని ప్రధాన పోటీదారులు సుమారు లక్ష మందిదాకా ఓటర్లకు డబ్బు పంపిణీ చేస్తారు. బరిలో ఉన్న బలమైన, గెలిచే అవకాశాలున్న ఇద్దరు లేదా ముగ్గురు అభ్యర్థుల నుంచి ఓటర్లు డబ్బు తీసుకుంటారు. వారిలో తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేస్తారు. మిగిలిన అభ్యర్థులకు గెలిచే అవకాశమే లేదు, ఏవో కొన్ని అరుదైన సందర్భాలు మినహాయిస్తే. దీంతో, చట్టవిరుద్ధంగా ఎన్ని కోట్లు ఖర్చు పెట్టే సామర్థ్యం ఉంది అన్నదే ఎన్నికల్లో పోటీ కోసం వచ్చిన అభ్యర్థుల్లో పార్టీలు వెతికే మొదటి అర్హత అవుతోంది. ఆ ఖర్చుకు సిద్ధపడితేనే టికెట్లిస్తున్నాయి. అందుకే టికెట్ అనగానే చాలా సందర్భాల్లో వెంటనే అడిగే ప్రశ్న, 'ఎంత ఖర్చు పెట్టగలరు?'. మన తలసరి ఆదాయం పేద దేశాల స్థాయిలో ఉంటే, ఓట్ల కొనుగోలు ఖర్చు మాత్రం చాలా రాష్ట్రాల్లో సంపన్న దేశాలను మించి ఉంటోంది. ఆ ఖర్చంతా అనివార్యంగా లెక్కలుచూపని నగదు రూపంలోనే జరుగుతుంటుంది, నల్లధనాన్ని, అవినీతిని పెంచుతుంటుంది. ఎన్నికవటానికి రూ.25%--%30 కోట్లు ఖర్చు చేసే అభ్యర్థి ఆ ఎన్నిక ఖర్చుతో పాటు, రాజకీయంగా ఒక స్థాయికి రావటానికి అంతకు ముందు చేసిన ఖర్చుని, గతంలో ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోతే అప్పుడైన ఖర్చుని కూడా తిరిగి రాబట్టుకోవాలి, వచ్చే ఎన్నికలో అవసరమైన నిధుల్ని కూడబెట్టాలి. మరి వ్యక్తిగతంగా కూడా వెనకేసుకోవాలి కదా. అందుకోసం అదనంగా కాస్త పెద్ద మొత్తంలోనే సంపాదన. వెరసి, చట్టవిరుద్ధమైన, లెక్కలు చూపెట్టని ఎన్నికల వ్యయం మన ఎన్నికల రాజకీయ వ్యవస్థలో మనుగడకి సర్వసాధారణంగా మారి, అవినీతిని అయిదు నుంచి పది రెట్లు పెంచుతోంది. ఎన్నికవటానికి ఒక పేద దేశంలో అంత భారీ మొత్తాల్ని ఖర్చు చేయటం పిచ్చి తప్ప మరోటి కాదు. అదేసమయంలో అధికారం పట్ల లాలసతో ఎన్నికల బరిలో ఎంతైనా ఖర్చు పెట్టి, ఎంత రిస్కయినా తీసుకోవటానికి సిద్ధపడుతున్న అభ్యర్థులు కావలసినంతమంది ఉన్నారు. ఫలితంగా, నిజాయతీ, ప్రజాసేవ పట్ల మమకారం ఉన్న పౌరులు మన ఎన్నికల ప్రక్రియలో ఉన్నకొద్దీ ప్రాధాన్యతను కోల్పోతున్నారు. ఎన్నికల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు, లేదంటే రాజకీయాల నుంచి గెంటివేయబడుతున్నారు, లేదూ, కాలక్రమంలో రాజీపడుతున్నారు, మనుగడ కోసం ఆటలో భాగమవుతున్నారు. నిజాయితీ, అధికారంలో మనుగడ కలిసిసాగటం ఉన్నకొద్దీ అసాధ్యమవుతున్నాయి. ఒక పౌరుడు వ్యక్తిగతంగా నిజాయతీపరుడు కావచ్చు, మన రాజకీయాల్లో ఇప్పుడు కూడా వ్యక్తిగతంగా నిఖార్సయినవాళ్లు చాలా మంది ఉన్నారు, కానీ ఎన్నికల్లో చట్టవిరుద్ధ ఖర్చు భరించటం కోసం, ఎన్నికల్లో తమ మనుగడని కాపాడుకోవటం కోసం వ్యవస్థీకృత అవినీతిలో వారూ భాగంకాక తప్పదు. ఓటరుకిచ్చే ప్రలోభాలు, విపరీత ఎన్నికల వ్యయం ఈవేళ ఏ స్థాయికి చేరాయంటే నైతిక విజ్ఞప్తులు, వ్యక్తిగత విలువలతో వాటిని ఎదుర్కోవటం ఇక ఎంతమాత్రం సాధ్యం కాదు. ఇప్పుడది వ్యవస్థీకృత సమస్య. ఓటరుకు ప్రలోభాల్నిచ్చే ధోరణికి పూర్తిగా స్వస్తి చెప్పేందుకు పార్టీలన్నీ నిజాయతీగా ఏకాభిప్రాయానికి రావటం అవసరం. కానీ అది పైకి కనిపిస్తున్నంత తేలిక కాదు. పార్టీలు పరస్పర అపనమ్మకంతో ఉన్నాయి. రాజకీయాల్లో గుర్తింపు కోసం భారీ మొత్తాల్ని వెచ్చించటానికి చాలామంది అభ్యర్థులు సిద్ధంగా ఉన్నప్పుడు, పార్టీల స్వీయనియంత్రణ ఆచరణలో సులభం కాదు. ఇక మిగిలిన పరిష్కారం, ఓట్ల కొనుగోలు వల్ల పెద్ద ఉపయోగంలేదనే రీతిలోకి ఎన్నికల వ్యవస్థను మార్చటం. ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్లే, మిగిలిన అభ్యర్థుల ఓట్లన్నీ వృథాయే అనే ఫస్ట్ పాస్ట్ పోస్ట్ ఎన్నికల వ్యవస్థ మనలాంటి పేద దేశంలో, అధికార కేంద్రీకరణ, బలహీన చట్టబద్ధపాలన ఉన్న దేశంలో ఓట్ల కొనుగోలుకు పెద్ద ప్రోత్సాహకంగా మారుతుంది. మనం సమష్టిగా ఆత్మావలోకనం చేసుకోవాలి, ప్రోత్సాహకాన్ని మార్చాలి. ధనస్వామ్యం, దోపిడీస్వామ్యం నుంచి మన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటానికి నిజమైన ఎన్నికల సంస్కరణ పద్ధతులపై మనం దృష్టి సారించటం తక్షణావసరం.

సామాజిక దృక్పథంతో మీరు రాసే రచనలు
editor. prajapalana@gmail.com
మెయిల్ కు పంపించినచో ప్రజా పాలన
దినపత్రికలో ప్రచురించబడును

# దారి తప్పుతున్న ప్రజాస్వామ్యం!

ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనప్పటికీ భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గత 75 ఏళ్లుగా వికసిస్తూ వస్తున్నది. శాంతియుతంగా అధికార మార్పిడి జరగడం, కీలకమైన జాతీయ అంశాలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు ఉమ్మడి స్వరంతో స్పందిస్తూ వుండడం మన ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం కావిస్తున్నది. అంతర్జాతీయంగా భారత్‌ను ఒక బలమైన సైనిక శక్తిగా గుర్తింపు




తెచ్చిన, బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు స్ఫూర్తి కలిగించిన 1971 నాటి యుద్ధం సమయంలో అధికార-ప్రతిపక్షాలు ఉమ్మడిగా వ్యవహరించిన తీరు చరిత్రాత్మకం. పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగినప్పుడు, కార్గిల్ యుద్ధం సమయంలో సహితం అటువంటి ఉమ్మడి కార్యాచరణను చూసాము. గత ఏడాది సరికొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభిస్తూ అత్యాధునిక వసతులతో, అత్యుత్తమ భద్రతా వ్యవస్థతో ఈ భవనం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అయితే కొద్ది నెలలకే ఆగంతకులు లోక్‌సభలో ప్రవేశించి, కలకలం రేపడం పార్లమెంట్ భద్రత పట్ల ప్రశ్నలు లేవనెత్తింది. నలుగురు వ్యక్తులు పార్లమెంటులోకి ప్రవేశించి, లోక్‌సభ లోపల, వెలుపల రంగురంగుల పొగ డబ్బాలను కాల్చడంతో ఆందోళన కలిగిస్తున్న భద్రతా ఉల్లంఘనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా నుండి ప్రకటన కోసం ప్రతిపక్షాల డిమాండ్ చేయడమే పార్లమెంట్‌లో ఎన్నడూ ఎరుగనంతగా ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్‌కు దారి తీసింది. ఈ దిగ్భ్రాంతికరమైన సంఘటనపై పార్లమెంటుకు తిరిగి నివేదించడానికి ప్రభుత్వం పాయింట్ బ్లాంక్‌గా నిరాకరించగా, ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా ఇద్దరూ వరుసగా ఒక టివి ఛానెల్, ఒక ప్రముఖ వార్తా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు, బిజెపి వేదికలపై ఈ విషయమై ప్రతిపక్షాలపై ఘాటైన విమర్శలు కూడా గుప్పించారు. కొత్త పార్లమెంట్ భవనం నిర్మాణం మన ఎంపిలను వారు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజల నుండి వేరు చేయడానికి మరింతగా అనువుగా రూపొందించారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్వరూపం గురించి ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా వున్న అవగాహనకు భిన్నంగా నేడు పార్లమెంట్‌లో వ్యవహారాలు జరుగుతున్నట్లు ఆందోళన కలిగిస్తున్నది. భారత ప్రజాస్వామ్యానికి మన రాజ్యాంగ నిర్మాతలు బలమైన పునాదులు వేశారు. వారి ఆలోచనల ప్రకారం అధికార పక్షంను జవాబుదారీ కావించడమే పార్లమెంట్ ప్రధాన కర్తవ్యం. పార్లమెంట్‌లో ప్రతిపక్షాలకు మొదటగా కనీసం మాట్లాడే అవకాశం ఇవ్వడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మౌలిక సూత్రం. ప్రతిపక్షం లేని ప్రజాస్వామ్యం అనూహ్యమైనది మాత్రమే కాదు, అది పూర్తిగా ప్రమాదకరం. దివంగత అమెరికా అధ్యక్షుడు హ్యారీ ట్రూమాన్ అంతర్గత భద్రతా విషయాలపై అమెరికా కాంగ్రెస్‌లో ప్రసంగిస్తూ ప్రముఖంగా హెచ్చరించినట్లుగా, 'ఒకసారి ప్రతిపక్షాల గొంతును నిశ్శబ్దం చేసే సూత్రానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటే, అది పౌరులందరికీ భయాందోళనలకు మూలంగా మారే వరకు, ప్రతి ఒక్కరూ భయంతో జీవించే దేశాన్ని సృష్టించే వరకు పెరుగుతున్న అణచివేత చర్యల మార్గం ఏర్పరచ్చుతుంది'. ప్రపంచంలోనే ప్రజాస్వామ్యానికి మాతృకగా చెప్పుకుంటున్న భారత్ నేడు ఆ దిశకు మారుతుందా? అనే భయాందోళనలు ఇప్పుడు కలుగుతున్నాయి. గత శీతాకాల సమావేశాల్లో అనూహ్యంగా 146 మంది ఎంపిలను సస్పెండ్ చేయడంతో ప్రతిపక్షమే లేకుండా పార్లమెంటులో చర్చలు జరగడం, ఏకంగా 17 బిల్లులు మెరుపు వేగంతో ఆమోదం పొందడం ఒక విధంగా విస్మయం కలిగిస్తోంది. వారిలో 78 మందిని ఒకే రోజు సస్పెండ్ చేశారు. బిజెడి, వైఎస్ఆర్‌సిపి, బిఆర్ఎస్ వంటి 'స్నేహపూర్వక' బిజెపియేతర పార్టీల ఎంపిలు మినహా వాస్తవంగా మొత్తం ప్రతిపక్షం లేకుండా ఎన్నో కీలక బిల్లును ఆమోదం పొందాయి. ఆ విధంగా ఆమోదం పొందిన బిల్లులతో కీలకమైన వలస పాలనకు సంబంధించిన సివిల్, క్రిమినల్ కోడ్‌లకు కీలకమైన సవరణలు వున్నాయి. అదే విధంగా ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన బిల్లు కూడా ఉంది. ఇటువంటి బిల్లులు సమగ్రమైన చర్చలే లేకుండా హడావుడిగా ఆమోదింప చేసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. మరో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతిపక్ష ఎంపిలపై పెద్ద ఎత్తున సస్పెన్షన్ వేటు వేయడం రాజకీయ ఎత్తుగడలో భాగమే అనే వాదన వినిపిస్తున్నది. ప్రజాస్వామ్యపు అత్యున్నత వేదికపై తమ గొంతును నిశ్శబ్దం చేయడం ద్వారా ఇప్పటికే మూడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో నిరాశకు గురైన ప్రత్యర్థిని మరింత నిరుత్సాహ పరచడం దీని లక్ష్యంగా భావించాల్సి వుంటుంది. బిల్లులను అంతరాయం లేకుండా వేగంగా ఆమోదింప చేసుకోవడాన్ని పార్లమెంటరీ పని తీరుకు కొలమానంగా భావిస్తున్నారు. 87%, 95%, 135% వంటి ఉత్పాదకత స్థాయిలను ప్రకటించడం ద్వారా గర్వంగా తాము పార్లమెంట్ సమావేశాలను ఏ విధంగా నిర్వహిస్తున్నామో అంటూ సంబరపడిపోతున్నారు. కీలకమైన అంశాలపై లోతైన చర్చలు జరిపి, అధికార, ప్రతిపక్షాల మధ్య ఏకాభిప్రాయం నిర్మించే ప్రయత్నాలకు వేదికగా పార్లమెంట్ వుండాలనే మౌలిక ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తున్నాము. ఒకటి, రెండు గంటల వ్యవధిలో కీలకమైన బిల్లులు ప్రతిపక్షాల ప్రమేయం లేకుండా ఆమోదింప చేసుకుంటూ ఘనంగా చాటుకొనే దుస్థితికి చేరుకొంటున్నాము. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, ఎన్నుకోబడిన నిరంకుశత్వానికి మధ్య ఉన్న తేడాను విస్మరిస్తున్నాము. సభ జరుగుతున్నప్పటికీ పార్లమెంటులో భద్రత ఉల్లంఘనపై మాట్లాడేందుకు హోం మంత్రి నిరాకరించడం కానీ, మీడియా ముందో, పార్టీ సమావేశాలలోనే ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పిస్తూ ఆ అంశంపై మాట్లాడడం గమనిస్తే జవాబుదారీ సూత్రాన్ని నిరాకరించడమే అవుతుంది. ప్రతిపక్షాల క్రమశిక్షణా రాహిత్యం పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మంచిది కాదనే బిజెపి తరచూ విమర్శలు గుప్పిస్తున్నది. గత కొంత కాలంగా ప్రతిపక్షాలు లేవనెత్తిన కీలక అంశాలపై చర్చలకు నిరాకరించడం, ఆ అంశాలు ప్రతిపక్షాలు లేవనెత్తుతున్నారనే సాకుతో సమావేశాలను వాయిదా వేస్తుండటం, చివరి రెండు, మూడు రోజుల్లో ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసి తమకు కావాలనుకున్న బిల్లులను సరైన చర్చలేకుండా ఆమోదింప చేసుకోవడం ఒక రివాజుగా మారుతున్నది.

మణిపూర్‌లో హింస కావచ్చు, అదానీ కంపెనీలపై చెలరేగిన ఆరోపణలు కావచ్చు, సరిహద్దుల్లో చైనా దురాక్రమణలు కావచ్చు, మరే జాతీయ ప్రాధాన్యత గల అంశాన్ని ప్రతిపక్షాలు లేవనెత్తినా గుడ్డిగా చర్చకు, కనీసం ప్రభుత్వ పక్షాన ఓ ప్రకటన చేసేందుకు నిరాకరిస్తున్నారు. అందుకు సహజమైన అభ్యంతరాలు వుంటే ప్రభుత్వమే ప్రతిపక్ష నాయకులను చర్చలకు పిలిచి, వారిని ఒప్పించే ప్రయత్నం చేయాలి. అటువంటి ప్రయత్నం జరగానే జరగడం లేదు. యుపిఎ ప్రభుత్వ కాలం వరకు ప్రభుత్వం కీలకమైన ఎటువంటి అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావింపదలచినా, ముఖ్యమైన బిల్లును ప్రవేశపెట్టదలచినా ముందుగా కీలక ప్రతిపక్ష నాయకులను మంత్రుల ద్వారా, అధికార పక్ష నేతల ద్వారా లేదా ఉన్నతాధికారుల ద్వారా సంప్రదించి, వారికి ఆయా అంశాల ప్రాధాన్యతను వివరించడం మన పార్లమెంటరీ సంప్రదాయంగా కొనసాగుతూ వచ్చింది. కానీ నేడు దశాబ్దాల కాలంగా అనుసరిస్తున్న ఇటువంటి పార్లమెంటరీ సంప్రదాయాలకు తిలోదకాలిస్తున్నారు. మరోవంక, ప్రతిపక్షాలు సహితం స్ఫూర్తిదాయకమైన ప్రత్యామ్నాయాన్ని రూపొందించడంలో వైఫల్యం చెందడం కూడా మన పార్లమెంటరీ ప్రమాణాలు దిగజారేందుకు దోహదపడుతుంది. పార్లమెంట్ సమావేశాల పట్ల వారు సహితం సీరియస్‌గా లేరని వారి ధోరణి వెల్లడి చేస్తుంది. పార్లమెంట్ మెట్లపై టిఎంసి సభ్యుడు కళ్యాణ్ బెనర్జీ రాజ్యసభ చైర్మన్‌ను అనుకరిస్తూ పేరడీ చేయడం, ఆ దృశ్యాన్ని రాహుల్ గాంధీ తన మొబైల్ ఫోన్ కెమెరాతో చిత్రీకరించడం వారి నైతిక ఔన్నత్యంను ప్రశ్నార్థకం కావిస్తుంది. నరేంద్ర మోడీకి దీటుగా ప్రజాకర్షణ గల నేతను ప్రతిపక్షాలు ప్రజల ముందుంచలేకపోవచ్చు. కనీసం ఉమ్మడిగా పోటీ చేసేందుకు సీట్ల సర్దుబాటు విషయంలో సహితం వాస్తవికంగా, ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో వ్యవహరింపలేక చతికలపడుతున్నట్లు ఇటీవల జరిగిన ఐదు అసెంబ్లీల ఎన్నికలు స్పష్టం చేశాయి. దివంగత కాంగ్రెస్ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ పదవీ కాలం ముగిసే సమయానికి మార్చి 1989లో చివరి సారిగా ఇటువంటి నాటకీయ పరిణామం పార్లమెంట్‌లో జరగడం గమనార్హం. ప్రధాని నరేంద్ర మోడీ కన్నా (353) ఎక్కుగా (404) ఎంపిల మద్దతుతో ఆనాడు రాజీవ్ గాంధీకి లోక్‌సభలో బలం ఉంది. విశేషమేమిటంటే ఆనాడు కూడా రాజీవ్ గాంధీ పదవీ కాలం చివరి రెండో పార్లమెంట్ సెషన్‌లో, ఆ సంవత్సరం లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన చివరి సెషన్‌లో, మొత్తం ప్రతిపక్షం పార్లమెంటుకు రాజీనామా చేసింది. ఆ తర్వాత 1989 చలికాలంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. చరిత్ర పునరావృతం కాకపోవచ్చు. కానీ గత పక్షం రోజుల్లో జరిగిన సంఘటనలు కలవరపెట్టే గతాన్ని గుర్తు చేస్తున్నాయి. భారీ మెజారిటీ వున్న ప్రభుత్వాలు తరచుగా బలహీనంగా అనే ప్రతిపక్షాల పట్ల చులకనగా వ్యవహరిస్తే ప్రమాదకర పరిణామాలను ఎదుర్కోవలసి రావచ్చని గమనించాలి.

## మనుషులు ఓడిపోయే నేల

క్రూరమైన అంటువ్యాధిలా యుద్ధ శంఖారావం
ఒక యిరుకు నేలను కబళిస్తున్నప్పుడు
హింసల డోలు మీద నెత్తుటి మోతలతో
పర్వతాలు లోయలు సముద్రాలు..
ఇల్లు ఆసుపత్రులు బడులు..
చుట్టూతా చావు ప్రతిధ్వనిస్తున్నప్పుడు
యుద్ధ విమానాల రెక్కల కిందనుండి
కన్నీటి పొగుల మీద బాంబుల పొగలు కమ్మి
దిగులుతోటల బతుకు శిథిలాల చుట్టూ
మంటల్లో తగలబడుతున్న పంటచేలలా
చెల్లాచెదురు ప్రాణాలు కొడిగడుతున్నప్పుడు
ఏ చిన్న శాంతి ప్రతిపాదనకూ
ధూసరగాలి ఊపిరాడనివ్వనపుడు
ప్రతి ఉదయం శవాల వెలికితీతకే
సూర్యుడక్కడ ఉదయిస్తున్నాడేమో!
ఇళ్ల పైకప్పులన్నింటిని మృత్యుగాలి ఎగరగొట్టేసినప్పుడు
బంధాల సమాధుల మీద పాశాల బుగ్గిరేగుతున్నపుడు
లేతబుగ్గల మీద మెరిసే చిరునవ్వుల్ని చిదిమేస్తూ
బంకర్లలో పార్కుల్లో పిల్లల ఆట స్థలాల్లో
సాలీళ్ళు గూళ్ళు కట్టుకుంటున్నప్పుడు
కొన ఊపిరి ఆశలు కూడా అలసిపోయి
చెట్లకొమ్మల్లో పళ్ళు కన్నీరవుతుండగానే
లేతచిగుళ్ళు ఒక్కొక్కటి నేల రాలిపోతున్నపుడు
వాటి దురదష్టానికి గుండె కరగకపోగా,
పొద్దస్తమానం సిగ్గు దాచుకోవడానికే
నిద్ర నటిస్తున్నావేమో నికృష్ట ప్రపంచమా !
భయము ఆకలి రోగము
ముగ్గురు సెంట్రీల పహారాలో
నిరాయుధులంతా ఉన్మాదుల కట్టుబానిసలై
మత్యువే వారికి ఆఖరి యజమానిగా మిగిలినప్పుడు
ఇంకా చావుకు చిక్కనివాళ్ళ కోసం ఆసుపత్రులన్నీ
శవాగారాలుగా మారిపోయినప్పుడు
హంతకముఠాలు జొరబడిన పవిత్ర భూమిలో
నెత్తుటి అంగాలు విరగ పండుతున్నపుడు
మనుషులు ఓడిపోయే ఓ ఆయుధాల నేలా !
ఆయుధాలను గెలవనిచ్చే ఓ అనైక్య రాజ్యాల సమితీ !
నిశ్చింతగా కళ్ళు మూసుకో,
నిద్రలోనే చచ్చిపో! నిద్రలోనే చచ్చిపో !



## ఎస్మా జీవోను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి




నరసాపురం, జనవరి 8 (ప్రజాపాలన ప్రతినిధి) :పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్మా జీవోను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్మా జీవో కాపీలను దగ్ధం చేసి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులు తమ న్యాయమైన కోరికల కోసం గత 28 రోజులుగా 28 సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించక పోగా అంగన్వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేయాలనే ఉద్దేశంతో ఎస్మా జీవోను విడుదల చేయటం రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఎస్మా జీవోను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, సిఐటియు నాయకులు పొగాకు నారాయణరావు, నోముల కొండ, పోరాడు బద్రి, పైలా సత్తిబాబు, పున్నాని అప్పలనాయుడు, బుడితి ఇజ్రాయిల్, జగన్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## 28వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె.




భీమవరం, జనవరి 8 (ప్రజాపాలన ప్రతినిధి) : తమకు కనీస వేతనాలను పెంచాలని, గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సమ్మె సోమవారం నాటికి 28వ రోజుకు చేరుకుంది. దీనిలో భాగంగా భీమవరం పట్టణంలోని ఎండివో కార్యాలయం సమీపంలోని సిఐటియు కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. వందల సంఖ్యలో అంగన్వాడీ ఉద్యోగులు రోడ్డు పై బైఠాయించి ఆందోళనలు కొనసాగిస్తున్నారు. అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని విడనాడాలని, తమ కోరికలను ఆమోదించాలని వారు డిమాండ్ చేశారు. గత 20 నుండి 30 సంవత్సరాలుగా అంగన్వాడీలుగా పనిచేస్తున్న సీనియర్లు కూడా తమలో ఉన్నారన్నారని తమపై అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టం ఎస్మా ను ప్రయోగించడం చట్ట ప్రకారం చెల్లదని ప్రభుత్వం జీవో నెంబర్ 2 ను ఉప సంహరించుకోవాలని అంగన్వాడీలు కోరారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ప్రకారం 26 వేల కనీస వేతనం ఇవ్వాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను తమకు వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.

## 14వ రోజుకు చేరుకున్న మునిసిపల్ కార్మికుల సమ్మె



భీమవరం, జనవరి 8 (ప్రజాపాలన ప్రతినిధి) : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జేఏసీ నాయకులు కర్రి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం నాటికి మున్సిపల్ కార్మికుల సమ్మె 14వ రోజుకు చేరిన సందర్భంగా జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులను, నాయకులను తిరుమల కళాశాల వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు అక్కడే రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కిలారు మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం తమతో మూడు దఫాలుగా చర్చలు జరిపిందని చిత్తశుద్ధితో సమస్యలు పరిష్కరించ కుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జేఏసీ నాయకులు చెల్లబోయిన రంగారావు, బి. వాసు దేవరావు, జి. నాని తదితరులు మాట్లాడారు. ధర్నాలో మున్సిపల్ వర్కర్స్ జేఏసీ నాయకులు నీలాపు శ్రీను, నీలాపు రాజు, నీలాపు ధనలక్ష్మి, ఎన్. విశ్వనాథం, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## రాష్ట్ర స్థాయి ఆటల పోటీలలో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



అనంతపురం ప్రజాపాలన ప్రతినిధి :రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2023-24 అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల ది: 4,5 %ు% 6 తేదీలలో నిర్వహించగా ఎ.ఎ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్.పాలిటెక్నిక్, గుడ్లవల్లేరు విద్యర్థులు బాలుర మరియు బాలికల గేమ్స్ %ు% స్పోర్ట్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ ను సొంతం చేసుకున్నారు. బాలికల గేమ్స్ వాలీ బాల్, టేబుల్ టెన్నిస్ డబుల్స్ %ు% సింగిల్స్ విభాగాలలో విన్నర్స్ గా నిలిచారు. అదేవిధంగా బాలికల స్పోర్ట్స్ విభాగం రన్నింగ్ లో 200 మీ, 800 మీ, విభాగాలలో మొదటి స్థానం, 100 మీ, 100 మీ 4 రిలే లో ద్వితీయ స్థానాన్ని, 400 మీ, ట్రిపుల్ జంప్, విభాగాలలో తృతీయ స్థానాన్ని సాధించారు.అదేవిధంగా బాలుర గేమ్స్ కబడ్డీ, బాల్ బాడ్మింటన్ లో ద్వితీయ స్థానాన్ని, బాలుర స్పోర్ట్స్ విభాగం రన్నింగ్ లో 200 మీ, 800 మీ, మరియు 4 400 మీ లలో మొదటి స్థానాన్ని, 400 మీలో ద్వితీయ స్థానాన్ని, 1500 మీలో తృతీయ స్థానాన్ని సాధించారు. రాష్ట్ర స్థాయి విజేతలుగా బహుమతులు సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించి కళాశాల ప్రతిష్టను యినుమడింపచేసిన విద్యార్థినీ విద్యార్థులను, ఫీజికల్ డైరెక్టర్ శ్రీ వి.శ్రీనివాసరావు, సహాయ ఫిజికల్ డైరెక్టర్ శ్రీ ఎమ్. భవదీప్ మరియు మెకానికల్ బ్రాంచ్ %జీతీ%.ఇన్స్ట్రక్టర్ కె.పిచ్చయ్య లను, విద్యార్థులకు ప్రత్యేక సహాయసహకారాలు అందించిన ఎస్.ఆర్.జి.ఈ.సి ఫీజికల్ డైరెక్టర్ శ్రీ ఎమ్.శివశంకర్, డి.పూజిత లను పాలిటెక్నిక్ యాజమాన్య సభ్యులు చైర్మన్ డా.వల్లూరుపల్లి నాగేశ్వర రావు, సెక్రటరీ %ు% కరెస్పాండెంట్ శ్రీ వి.సత్యనారాయణ రావు, కో - సెక్రటరీ %ు% కరెస్పాండెంట్ శ్రీ వి.రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంటార్ శ్రీ ఎన్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీ ఎన్.రాజశేఖర్ %ు% వివిధ విభాగాల శాఖాధిపతులు అభినందించారు.

# ఏపీలో మేనిఫెస్టో వార్

విజయవాడ, జనవరి 8,: ప్రజాపాలన ప్రతినిధి :ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్నాయి. సంక్రాంతి తర్వాత ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. దీంతో అన్ని పార్టీలు వ్యూహాల రూపొందించుకుంటున్నాయి. అభ్యర్థుల ఎంపికలో తలమునకలై ఉన్నాయి. సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని జగన్ నమ్మకంగా చెబుతుండగా.. ప్రభుత్వ వైఫల్యాలే తమను గెలిపిస్తాయని టిడిపి, జనసేన ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.ఇప్పటికే ఉన్న సంక్షేమ పథకాలకు తోడు.. అదనంగా కొన్ని అంశాలతో మేనిఫెస్టో ప్రకటించాలని జగన్ కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆరు పథకాలతో టిడిపి మినీ మేనిఫెస్టోను ప్రకటించింది. త్వరలో జనసేనతో కలిసి ఉమ్మడి మేనిఫెస్టో ప్రకటనకు కసరత్తు చేస్తోంది. మేనిఫెస్టోను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి.. వారి అభిమానాన్ని చురగొనాలని ఎవరికి వారే ప్రయత్నాలు ప్రారంభించారు.తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టోను తీసుకొచ్చింది. దీనిలో నిరుద్యోగులు, మహిళలు, రైతులకు పెద్దపీట వేశారు. దీనికి తోడు తెలుగుదేశం పార్టీకి ఆది నుంచి కూడా అండగా ఉన్న బీసీలకు కూడా ఈ మేనిఫెస్టోలో స్థానం కల్పించారు. మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు మహాశక్తి పేరుతో పథకాన్ని తీసుకొస్తామని చెప్పుకొస్తున్నారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడపడుచుకి స్త్రీ నిధి కింద నెలకు 1500 రూపాయలు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ



చేస్తామని చెబుతున్నారు. దీంతో పార్టీ తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ.. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15,000 అందించేలా పథకాన్ని ప్రకటించారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ లను ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించారు. ఉచిత బస్సు ప్రయాణం పథకం కింద స్థానిక ఆర్టీసీ బస్సుల్లో మహిళలందరికీ టిక్కెట్ లేని ప్రయాణ సౌకర్యం కల్పించ నున్నారు.మినీ మేనిఫెస్టోలో భాగంగా చంద్రబాబు రిచ్ టు పూర్ అనే పథకాన్ని ప్రవేశ పెట్టారు.ఈ పథకంలో పేదలను సంపన్నులు చేసే విధంగా టిడిపి, జనసేన ప్రభుత్వం ముందడుగు వేస్తుందని ప్రకటించారు. ఐదేళ్లలో పేదల ఆదాయాన్ని రెట్టింపు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ప్రకటించారు. వైసిపి హయాంలో 26 మందికి పైగా బీసీలు హత్యకు గురయ్యారు. 650 మంది నాయకులు పై తప్పుడు కేసులు పెట్టారు. రాష్ట్రంలో 43 మందికి పైగా ముస్లిం మైనారిటీలపై దాడులు జరిగాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని టిడిపి బీసీలకు రక్షణ చట్టాన్ని ప్రకటించింది. అటు రాష్ట్రంలో అన్నదాత పథకం కింద రైతులకు పదిహేను వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించాలని కూడా నిర్ణయించింది. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని.. ప్రతి నిరుద్యోగికి యువగళం నిధి కింద నెలకు 2500 రూపాయలను అందించనున్నట్లు ప్రకటించింది.అయితే ఇప్పటికే నవరత్నాల రూపంలో అన్ని రకాల సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు వైసీపీ చెబుతోంది. అయితే కీలకమైన మద్య నిషేధం ఏమైనట్టు అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నవరత్నాల్లో మద్యాన్ని నిషేధిస్తామని జగన్ స్పష్టం చేశారు. స్పష్టమైన ప్రకటన చేశారు. కానీ అమలు చేయలేకపోయారు. సిపిఎస్ రద్దు చేస్తానని ఉద్యోగులు హామీ ఇచ్చారు. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని కూడా చెప్పుకొచ్చారు. పెద్ద ఎత్తున ఉద్యోగాలు భర్తీ చేస్తానని ఆర్భాటంగా ప్రకటించారు. కానీ ఏ ఒక్కటీ చేయలేకపోయారు. పైగా ఉద్యోగులకు ఉన్న రాయితీలను సైతం నిలిపివేశారు. గత ఎన్నికలకు ముందు పాదయాత్ర చేసే సమయంలో చాలా వర్గాలకు ఎన్నో రకాల హామీలు ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరిచి పోయారు. కేవలం బటన్ నొక్కడానికి పరిమితమయ్యారన్న విమర్శ ఉంది. అటు చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో పై ప్రజల్లో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. గత ఎన్నికల ముందు జగన్ ప్రకటించిన నవరత్నాలు అంత స్పీడుగా ప్రజల్లోకి వెళ్ళలేదన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. 2014 ఎన్నికల్లో సైతం నిరుద్యోగ భృతి, రుణమాఫీ వంటి విషయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. దీంతో ప్రజలకు చంద్రబాబుపై ఒక రకమైన అపనమ్మకం ఏర్పడింది. ఆ ప్రభావం మినీ మేనిఫెస్టో పై పడింది. గెలుపు కోసం ఎత్తుగడ మాత్రమేనని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. అయితే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్న హామీ మాత్రం బాగుందని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలు ఒక స్టంట్ గానే ఎక్కువమంది అభివర్ణిస్తున్నారు. పాలనాపరంగా చంద్రబాబుకు, సంక్షేమ పథకాల పరంగా జగన్ కు ప్రజలు మద్దతు తెలుపుతుండడం విశేషం.























**కావలెను**

స్నేహ గ్రూప్ విజయవాడ, గుంటూరు, వైజాగ్ హైదరాబాద్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
నెలకు రూ.15,000/- జీతం,
ట్రావెలింగ్ అలవెన్సు, ఇన్సెంటివ్ ఇవ్వబడును.
ఆసక్తి గలవారు మీ వివరాలని ఈ క్రింది నెంబర్ కి వాట్సాప్ చేయగలరు.
7660027683, 91549 58315

# ముందున్నది...మొసళ్ల పండుగ

ఛాయ్ తాగడం. సమోసాలు తినడం తప్ప ఆ కూటమి నేతలు చేసేదేమీ లేదు" అని ఆ మధ్య ఓ కీలక నేత ఇండియా కూటమిపై ఇలా సెటైర్లు వేశారు. పొలిటికల్ కామెంట్స్ ఇలానే ఉంటాయని అనుకున్నా...నిజంగా జరుగుతోంది అదే కావచ్చు అనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు మరెన్నో నెలల సమయం లేదు. ఇప్పటి నుంచే యాక్టివ్ అయితే తప్ప మోదీ సర్కార్‌ని ఢీకొట్టడం సాధ్యం కాదు. అసలు ఈ పాటికే గ్రౌండ్ అంతా ప్రిపేర్ చేసుకోవాలి. కానీ...ప్రతిపక్షాలు మాత్రం ఇంకా "ఏం చేద్దాం" అనే దగ్గరే ఆగిపోయినట్టు కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో కచ్చితంగా తమ ప్రభావం చూపించాలను కుంటున్న పార్టీలన్నీ ఒక్కతాటిపైకి వచ్చాయి సరే...మరి తరవాతి సంగతేంటి..? ఇప్పటికి నాలుగైదు సార్లు సమావేశమయ్యారు. కానీ ఇప్పటి వరకూ కూటమి నుంచి అధికారికంగా "ఇదీ మా ప్రణాళిక" అన్న ప్రకటన రాలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తప్ప మిగతా ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించినట్టే కనిపించడం లేదు. కూటమిలో అంతా బాగానే ఉండుంటే ఈ పాటికి సీట్‌ల షేరింగ్ విషయంలో ఓ స్పష్టత వచ్చుండేది. ఇక్కడే పార్టీల మధ్య విభేదాలు మొదలయ్యాయి. సైద్ధాంతిక విభేదాలున్న తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలు కలవడం అంటే అదో వింతే. అప్పట్లో బెంగాల్‌లో పంచాయతీ ఎన్నికలు జరిగినప్పుడు ఈ రెండు పార్టీల మధ్య ఎన్ని విభేదాలు తలెత్తాయో తెలియంది కాదు. కానీ కూటమి ఈ రెండు పార్టీలనూ ఒక్క చోటకు చేర్చింది. అది ఆ దశకే పరిమితమైంది. సీట్‌ల పంపకాల విషయంలో చిక్కులు వీడడం లేదు.



కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి ఇటీవల బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కాస్త గట్టిగానే విమర్శలు చేశారు. "ఆమె మోదీకి సేవలు చేయడంలోనే సరిపోతున్నట్టుంది" అంటూ మండి పడ్డారు. అసలే ఉప్పు నిప్పు లాంటి పార్టీలు...చివరకి వరకూ ఎలా కలిసి ఉంటాయన్న అనుమానాలకు ఈ విభేదాలు మరింత బలం చేకూర్చుతున్నాయి. ఇక్కడే మరో విషయమూ చెప్పుకోవాలి. "మాపై మీరు జాలి చూపించాల్సిన అవసరం లేదు" అని మమతా బెనర్జీపై కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి నేరుగానే విమర్శలు చేశారు. అంతే కాదు. సొంతగా పోటీ చేసి కూడా గెలిచి చూపిస్తాం అని తేల్చి చెప్పారు. అంటే...బెంగాల్‌లో సీట్‌ల పంపకాల్లో తేడాలు వస్తున్నట్టేగా. ఇక్కడొక్కచోటే కాదు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్‌లోనూ సీట్‌ల పంపకాల సమన్వయని తేల్చడం అంత సులభమేమీ కాదు. మహారాష్ట్ర, బిహార్, యూపీ, వెస్ట్ బెంగాల్, పంజాబ్‌లో సీట్ షేరింగ్ విషయంలో చాలా ఆచితూచి వ్యవహరించాలని చూస్తోంది కాంగ్రెస్. అదే సమయంలో స్థానిక పార్టీలకు ఎక్కువ సీట్‌లు ఇచ్చేందుకు మాత్రం ఆసక్తి చూపించడం లేదు. ఈ డబుల్ గేమ్ వల్లే ఈ సమస్య కొలిక్కి రావడం లేదు. యూపీలో మొత్తం 80 లోక్‌సభ స్థానాలున్నాయి. అందులో కనీస 15-20 సీట్లలో పోటీ చేయాలని చూస్తోంది కాంగ్రెస్. మహారాష్ట్రలో 48 ఉండగా అందులో 16-20 స్థానాల్లో, పశ్చిమ బెంగాల్‌లో 6-10 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తోంది. ఇది విశ్వసనీయ వర్గాల ద్వారా అందిన సమాచారం మాత్రమే. ఈ లెక్క పెరగొచ్చు కూడా. కానీ...తగ్గే అవకాశాలైతే కనిపించడం లేదు. ఆ మాత్రం స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టకపోతే అసలు తాము పోటీ చేసి ఏం లాభం అనే వైఖరితో ఉంది కాంగ్రెస్. కానీ 2019 నాటి ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక పార్టీలు కాంగ్రెస్‌కి అన్ని సీట్లు ఇచ్చేందుకు ముందుకు వస్తాయా లేదా అన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న. యూపీలో మాత్రం సమాజ్‌వాదీ పార్టీతో పెద్దగా విభేదాలైతే లేవు. ఒకవేళ అఖిలేష్ యాదవ్ ఒప్పుకుంటే యూపీలో కాంగ్రెస్‌కి పెద్దగా సవాళ్లు ఏమీ ఎదురుకాకపోవచ్చు. సీట్‌ల పంపకాలూ తొందరగానే పూర్తవుతాయి. కాంగ్రెస్‌కి ఉన్న సమస్యల్లా బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లోనే. బిహార్‌లో ఆర్జేడీ జేడీయూ లాంటి స్థానిక పార్టీలదే హవా. తమకు బలం ఉన్న నియోజకవర్గాలను వదులుకుని కాంగ్రెస్‌కి ఛాన్స్ ఇస్తాయా అన్నది అంతు తేలని ప్రశ్న. అయినా కాంగ్రెస్ కోసం మేమెందుకు త్యాగం చేయాలన్న ఆలోచన వాళ్లలో వచ్చిందంటే హస్తం పార్టీకి చివరకు నాలుగైదు సీట్ల కన్నా ఎక్కువగా మిగలవు. అక్కడే పోటీ చేయాల్సి ఉంటుంది. ఇందుకు కాంగ్రెస్ ఒప్పుకోకపోవచ్చు. అటు మహారాష్ట్రలోనూ ఉద్ధవ్ థాక్రే శివసేన పార్టీకి, కాంగ్రెస్‌కి అసలు పొసగడం లేదు. కచ్చితంగా 20 సీట్లలో అయినా పోటీ చేస్తామని శివసేన మొండి పట్టుపడుతోంది. కాంగ్రెస్ కూడా దాదాపుగా అదే కోరుకుంటోంది. కానీ ఎవరి లెక్కలు వాళ్లకుంటాయిగా. పైగా అన్ని స్థానిక పార్టీలూ ఈ లోక్‌సభ ఎన్నికలని చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. తనకు మాలిన ధర్మం ఎందుకన్న ధోరణిలోనే ఆలోచిస్తున్నాయి. పైగా కాంగ్రెస్‌కి సీట్‌లు ఇవ్వాలంటే గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం ఎంత ఉందో అన్న లెక్కలు తీస్తున్నాయి. ఈ లెక్కల ఆధారంగా చూస్తే కాంగ్రెస్‌కి తక్కువ సీట్‌లే కేటాయించే అవకాశాలున్నాయి. ఖర్గే ఒక్కరే కాస్త ముందు పడి ఈ సీట్‌ల లెక్కల్ని తేల్చేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. కానీ...కాంగ్రెస్‌లో మిగతా నేతలెవరూ పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. అటు ఆమ్ ఆద్మీ పార్టీతోనూ విభేదాలు పక్కన పెట్టి కలిసి నడవడం అంత సులువేమీ కాదు. పంజాబ్‌లో ప్రస్తుతం ఆప్ ప్రభుత్వమే ఉంది. ఇక్కడ కాంగ్రెస్‌కి మంచి క్యాడర్ ఉంది. అందుకే ఇక్కడ ఎక్కువ సీట్‌లలో పోటీ చేయాలని ఆశ పడుతోంది. కానీ...ఇప్పటికే అధికారంలో ఉన్న ఆప్ ఆ అవకాశం ఇస్తుందా అన్నది స్పష్టత లేదు. మరో 15-20 రోజుల్లో అంతా సెటిల్ చేసేస్తాం అని ఖర్గే చాలా ధీమాగా చెబుతున్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ ఇన్ని సమస్యలు ఎదురవుతుంటే ఖర్గే ఏ కాన్ఫిడెన్స్‌తో అలా చెబుతున్నారన్నది ఆసక్తికర విషయం. అలా అని ఆయనను తక్కువ అంచనా వేయడానికీ వీల్లేదు. కొన్ని చోట్ల తగ్గినా సరే..కూటమిగా నిలబడడం మంచిదనే ఆలోచనలో ఉన్నారేమో. ఎందుకంటే...కూటమిలో లుకలుకలు మొదలైతే ముందుగా ఆ అపవాదు మూటగట్టుకోవాల్సింది కాంగ్రెస్ పార్టీయే.

## హనుమకొండ లో చెట్టును ఢీకొన్న ఆర్.టి.సి బస్సు

హనుమకొండ: ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. హసన్ పర్తి పెద్ద చెరువు వద్ద ఘటన జరిగింది. బస్సు వరంగల్ నుండి కరీంనగర్ వెళుతోంది. ఘటనలో 20 మంది ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. బస్సులో 50 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. ప్రయాణికుల్లో ఒకగర్భవతివుంది.గాయపడ్డ వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

## పట్టణం నలుమూలలా అభివృద్ధి: ప్రభుత్వ విప్ గ్రంథి



భీమవరం, జనవరి 8 (ప్రజాపాలన ప్రతినిధి) : భీమవరం పట్టణంలో గత నాలుగున్నర ఏళ్లుగా వంద కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామని త్వరలో మరిన్ని అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక క్యాంపు కార్యా లయంలో మున్సిపల్, ఆర్ అండ్ బి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లా డుతూ ఈనెల 10వ తేదీన వాటర్ ఫిల్టర్నేషన్ ప్లాంటును ప్రారంభించనున్నామని తెలిపారు. ఇప్పటివరకు పట్టణానికి కోటి లీటర్ల నీటిని సరఫరా చేస్తున్న నేపథ్యంలో ప్లాంట్ ప్రారంభం అనంతరం త్రాగునీటి సామర్థ్యం కోటి లీటర్ల నుండి రెండు కోట్ల 70 లక్షల లీటర్లకు పెరుగు తుందని అన్నారు. పట్టణమంతా ఒకే సమయంలో మంచి నీటిని సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అమృత పథకంలో రెండవ ఫేజ్ లో రూ .48 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని 2053 వరకు పెరుగు తున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని పట్టణంలో అవసరమైన చోట ఓ హెచ్ఆర్ లను, పైపులైన్లను వేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే 4, 31,39 వ వార్డులలో నిర్మాణం పూర్తి చేసుకున్న మంచినీటి రిజర్వాయర్లను త్వరలోనే ప్రారంభిస్తామని తాడేరు నూతన వంతెనను ఈనెల14వ తేదీన ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. 2019లో రెండోసారి ఎమ్మెల్యేగా అధికారంలోకి వచ్చిన తర్వాత అటుగా వెళుతున్న సమయంలో ఈ వంతెనను పరిశీలించి శిథిలావస్థకు చేరుకుందని గుర్తించి నూతన వంతెన పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. పట్టణంలో తాము చేసిన అభివృద్ధి కనిపిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, ఎంఈ త్రినాధరావు, ఆర్ అండ్ బి డిఈ రామరాజు, మున్సిపల్ డీఈ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కంపుకొడుతున్న బస్తీలు



తిరుపతి, జనవరి 8,: స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో స్వచ్ఛతే కరువైంది. బస్తీల్లో ఎటు చూస్తే అటు పేరుకుపోయిన చెత్త కుప్పలు. ముక్కుపుటాలు అదిరిపోయే దుర్గంధం, చెత్త కుండీలు నిండిపోయి రోడ్డుపై చెల్లా చెదురుగా పడి ఉన్న చెతను పందులు, వీధికుక్కలు మరింత చిందరవందర చేస్తుండడంతో ఆ దారిలో వెళ్లాలంటేనే భయమేస్తోంది. దోమల బెడద సరేసరి. ఇది రాష్ట్రంలో ఎక్కడో ఉన్న బస్తీల సంగతి కాదు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి నివాసానికి కూతవేటు దూరంలో ఉండే చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల పరిస్థితి. ఇక్కడే ఇటువంటి పరిస్థితి ఉంటే, రాష్ట్రంలో మిగతా ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. . ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే అంటు వ్యాధులు విజృంభించి రాష్ట్రం రోగాంధ్రప్రదేశ్‌గా మారే ప్రమాదముందని, కరోనా మళ్లీ తలెత్తుతున్న స్థితిలో ఇది విపత్కర పరిణామాలకు దారి తీసే ప్రమాదముందని ప్రజారోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిసెంబరు26 నుంచి మున్సిపల్ వర్కర్స్ చేస్తున్న సమ్మెను పరిష్కరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. అందునా సంక్రాంతి పండగ దగ్గర పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం బెట్టు వీడి సమ్మెను పరిష్కరిస్తే మంచిదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరుతున్నారు. 14 రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా వారి ప్రధానమైన డిమాండ్లను అంగీకరించకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నది. సమ్మెను విఫలం చేసేందుకు పోటీ కార్మికులు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రంగంలోకి దింపాలని చూసింది. పోటీ కార్మికులు కూడా సమ్మెకు దిగారు. టన్నులకొలది పోగుపడుతున్న చెత్త ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు దర్పణం పడుతున్నాయి.గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ (జివిఎంసి) పరిధిలో ప్రతి రోజూ 845 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతోంది. సమ్మె ప్రారంభమైన నాటి నుంచి దాదాపు 2,500 టన్నులు చెత్త పోగయింది. దీనిలో 1,200 టన్నుల చెత్తను మాత్రమే అధికారులు తొలగించగలిగారు. జివిఎంసి పరిధిలో 990 మంది పర్మినెంట్, 4,900 అవుట్ సోర్సింగ్ కార్మికులు ఉన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులందరూ సమ్మెలో ఉన్నారు. పర్మినెంట్ కార్మికులతో అధికారులు చెత్తను తీయిస్తున్నారు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ప్రతి రోజూ 800 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. 300 మంది పర్మినెంట్ కార్మికులు ఉన్నారు. ప్రస్తుతం 110 నుంచి 150 మెట్రిక్ టన్నుల చెత్త మాత్రమే సేకరణ జరుగుతోంది. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో ప్రతి రోజూ 120 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతోంది. పర్మినెంట్ కార్మికుల ద్వారా ప్రస్తుతం 25 మెట్రిక్ టన్నుల చెత్త మాత్రమే సేకరణ జరుగుతోంది. విజయనగరంలో 480 మంది కార్మికులు సమ్మెలో ఉండటంతో ఎక్కడి చెత్త అక్కడే పోగుపడుతోంది. మరోవైపు కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో మురికి నీరు ప్రధాన వీధుల్లోకి ప్రవహిస్తున్నాయి. నగరంలోని 50 డివిజన్లలో ఇదే పరిస్థితి నెలకొంది. ఒంగోలు నగరంలో ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమం మూడు, నాలుగు రోజులకోసారి జరుగుతోంది. మిగతా మున్సిపాలిటీల్లోనూ కాలనీల్లో, బ్లాక్ పాయింట్ల వద్ద చెత్త కుప్పలుకుప్పలుగా పేరుకుపోయింది. డ్రెయినేజీ శుభ్రత పూర్తిగా నిలిచిపోయింది. దోమల ఉధృతి పెరిగింది. ఇళ్లల్లో చెత్త సేకరణ నిలిచిపోవడంతో ప్రజలు కూడా మున్సిపల్ కార్మికుల సమ్మె గురించి చర్చించుకుంటున్నారు. కార్మికులు ఎప్పుడు విధుల్లోకి వస్తారని వాకబు చేస్తున్నారు.శ్రీకాకుళం జిల్లా పలాస కాశీబుగ్గ కెటి రోడ్డుతో పాటు వార్డుల్లో చెత్తా పేరుకుపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తడి చెత్తా, పొడి చెత్తా ఒకే ప్రాంతంలో పారవేయడంతో దుర్వాసన భరించలేక పోతున్నామని పట్టణ ప్రజలు, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చాపురంలో రెగ్యులర్ ఉద్యోగులతో అరకొర పారిశుధ్య పనులు పడుతున్నా కాలనీల్లో చెత్త కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అనంతపురం నగర పాలక సంస్థతోపాటు ఆరు మున్సిపాలిటీలు ఐదు నగర పంచాయతీల్లోని ప్రతి వీధుల్లోనూ చెత్త పేరుకుపోయింది. ఇంజనీరింగ్ కార్మికులు కూడా జిల్లాలో సమ్మెలో ఉండటంతో ప్రధాన వీధుల్లో తప్ప తక్కిన చోట్ల రాత్రి సమయాల్లో వీధి లైట్లు కూడా వెలగడం లేదు.ఏలూరు కార్పొరేషన్‌లో ఏ వీధి చూసినా చెత్తతో నిండిపోయింది. ప్రతి ఇంటివద్ద చెత్తడబ్బలు నిండిపోయాయి. రహదారులపైనే చెత్త పడేస్తున్నారు. విశాఖ నగరంలోని పూర్ణామార్కెట్, జగదాంబ, ఎంవిపి.కాలనీ, కెఆర్ఎం.కాలనీ, జాలారిపేట, గాజువాక, మధురవాడ, మల్కాపురం, కంచరపాలెం, గోపాలపట్నం వంటి ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం అక్కడక్కడా ప్రయివేటు వ్యక్తులను పెట్టి చెత్త తరలింపు పనులు చేయిస్తున్నా నగరం మొత్తం కంపుకొడుతోంది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కార్మికుల సమ్మెతో డ్రెయిన్లలో సిల్టును తీసేవారు కరువయ్యారు. మరో రెండు రోజులు ఇలాగే ఉంటే వీధుల్లోకి మురుగునీరు ప్రవహించే ప్రమాదం ఉంది. కాకినాడ జిల్లా సామర్లకోట, పెద్దాపురంలో కార్మికుల సమ్మెతో పారిశుధ్యం పనులు చాలా వరకూ నిలిచిపోయాయి. మెయిన్ రోడ్డులను మాత్రం పర్మినెంట్ కార్మికులు శుభ్రం చేస్తున్నారు. వార్డుల్లోకి శానిటేషన్ సిబ్బంది రాకపోవడంతో చెత్తకుండీలు నిండిపోయాయి. తిరుపతి జిల్లా గూడూరు మున్సిపాలిటీ కంపు కొడుతోంది. చెత్తను తొలగిస్తున్నట్లు మున్సిపల్ కౌన్సిలర్స్ ఫొటోకు ఫోజులివ్వడమే తప్ప కార్మికుల సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదు. అధికార మెప్పుకోసం పోటీ కార్మికులతో పనులు చేయిస్తూ..అడ్డుకుంటున్న వారిపై బైండోవర్ కేసులు పెడుతున్నారు. ఉమ్మడి కడప, కర్నూలు, కృష్ణాలోని ప్రధాన పట్టణాలు చెత్తతో పేరుకుపోయాయి. వీధులన్నీ దుర్వాసనలు వెదజల్లుతున్నాయి.

# సొంతూరుకు రఘురామరాజు



ఏలూరు, జనవరి 8,: సాధారణంగా సొంత గ్రామంలో నేతలు సంక్రాంతి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందునా గోదావరి జిల్లాల్లో అయితే ఆ సందడే వేరు. తాము ఎక్కడ ఉన్నా సంక్రాంతి ఆ నాలుగు రోజులు స్వగ్రామాల్లో గడపడం ఆనందంగా ఫీలవుతారు. అటువంటిది వైసీపీ ఎంపీ రఘురామకృష్ణంరాజు గత నాలుగు సంవత్సరాలుగా సంక్రాంతి నాడు సొంత గ్రామానికి దూరమయ్యారు. సొంత పార్టీని, సొంత ప్రభుత్వాన్ని, అధినేతను ధిక్కరించడంతో సొంత నియోజకవర్గాన్ని సందర్శించాలంటే సవాలక్ష నిర్బంధాలు ఎదుర్కొన్నారు. పోలీస్ కేసులతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అయితే ఎన్నికలు ముంగిట ఈ సంక్రాంతి మాత్రం నరసాపురంలోనే జరుపుకోవాలని బలమైన ఆకాంక్షతో ఉన్నారు.గతంలో చాలాసార్లు నరసాపురం వెళ్లేందుకు రఘురామకృష్ణంరాజు ప్రయత్నించారు. కానీ పోలీసులు ఎన్ని కేసులు పెట్టారో తెలియడం లేదు. రహస్యంగా ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారో బయట పెట్టడం లేదు. రాత్రికి రాత్రి అరెస్టు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఓసారి పుట్టినరోజు అని కూడా చూడలేదు. హైదరాబాద్ వెళ్లి గుంటూరు తీసుకొచ్చి మరీ థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. ఏకంగా రాజద్రోహం కేసు పెట్టి రఘురామకృష్ణంరాజుకు నరకం చూపించారు. అందుకే చాలాకాలంగా ఢిల్లీ, హైదరాబాద్ కి ఆయన పరిమితం అయ్యారు. కానీ ఆయన కుమారుడు మాత్రం నియోజకవర్గానికి వెళ్లి పనులన్నీ చక్కబెడుతున్నారు.వచ్చే ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేయాలని రఘురామకృష్ణంరాజు భావిస్తున్నారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీతో జనసేన జతకట్టింది. బిజెపి కూడా కలిసి రానుందని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా రఘురామకృష్ణం రాజు ఎంపీగా పోటీ చేస్తారని టాక్ నడుస్తోంది. అందుకే ఈ సంక్రాంతికి నరసాపురం రావాలని రఘురామరాజు డిసైడ్ అయ్యారు. ఎన్నికల ముంగిట మరోసారి ఏపీ ప్రభుత్వం ఇబ్బంది పెడితే అది రాజకీయంగా వారికే నష్టం జరుగుతుందని అంచనాకు వచ్చారు.ఎప్పుడూ సంక్రాంతికి సొంత గ్రామంలో ఉండడం రఘురామరాజు ఆనవాయితీగా చేసుకున్నారు. కానీ గత నాలుగు సంవత్సరాలుగా వైసీపీ సర్కార్ ఉక్కు పాదం మాపడంతో సొంత ప్రాంతంలో అడుగుపెట్టలేకపోయారు. ఇప్పుడు ఎన్నికల ముందు పోలీసులు ఓవర్ యాక్షన్ చేస్తే అది అంతిమంగా రఘురామకే ప్లస్ అవుతుంది. అందుకే ఈసారి ధైర్యంగా నరసాపురంలో అడుగు పెట్టేందుకు రఘురామకృష్ణంరాజు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.


# 3వ లిస్ట్ కోసం...మూడెదవరికి..?

విజయవాడ, జనవరి 8,: సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తూ జగన్ నిర్ణయాలు తీసుకుంటున్నారు. మహిళలు, యువత, కొత్తవారికి అవకాశం కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టి, బిసి, మైనారిటీలకు తగిన ప్రాధాన్యమిస్తున్నారు. ఏపీలో పొలిటికల్ హిట్ నెలకొంది. ఎన్నికల వాతావరణం స్పష్టంగా కనిపిస్తోంది. అవకాశాలు దక్కని వారు ప్రత్యామ్నాయల కోసం వెతుక్కుంటున్నారు. పార్టీల నుంచి వీడడం, వేరే పార్టీలో చేరడం శరవేగంగా జరిగిపోతున్నాయి. అభ్యర్థుల ఎంపిక విషయంలో వైసీపీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే రెండు విడతల్లో 38 మంది అభ్యర్థులను ఆ పార్టీ మార్చింది. ఇప్పుడు తుది జాబితాకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి కసరత్తు పూర్తయింది. ఈ సాయంత్రానికి జాబితా వెలువడే అవకాశం ఉంది.సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తూ జగన్ నిర్ణయాలు తీసుకుంటున్నారు. మహిళలు, యువత, కొత్తవారికి అవకాశం కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టి, బిసి, మైనారిటీలకు తగిన ప్రాధాన్యమిస్తున్నారు. మలి జాబితాలో అన్ని కులాల వారి ప్రాతినిధ్యం ఉండేలా చూసుకున్నట్లు తెలుస్తోంది. మూడో విడత జాబితా పై దాదాపు కసరత్తు పూర్తయినట్లు సమాచారం. కొద్దిపాటి చేర్పులు మార్పులు చేస్తూ వైసీపీ అగ్రనాయకత్వం 25 మంది పేర్లతో ఈ జాబితాను వెల్లడించే అవకాశాలు కనిపిస్తున్నాయి.ప్రధానంగా అనంతపురం, సత్య సాయి పుట్టపర్తి, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది.అనంతపురం జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కాపు రామచంద్రారెడ్డికి ఈసారి టిక్కెట్ దక్కదన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఆయన సమాచారం అందుకొని పార్టీకి రాజీనామా కూడా చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. ఈ మూడో జాబితాలో రాయదుర్గం ఇన్చార్జి పేరును ప్రకటించే అవకాశం ఉంది. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం లో కూడా మార్పులు ఉన్నట్లు సమాచారం.

# పశ్చిమ పార్టీల నేతల్లో గందరగోళం...

ఏలూరు, జనవరి 8,: రాజకీయాలు నాకేమి కొత్త కాదు అంటున్నారు అక్కడ ఉన్న సీనియర్ పొలిటీషియన్. అయితే ఆయన ఆదమరిచి ఉంటే టికెట్ ఎగరేసుకుపోవటానికి సొంత అనుచరులే సిద్ధంగా ఉన్నారు. మరోవైపు పగలు కౌగిలించుకుంటూ రాత్రులు కత్తులు నూరుకుంటున్నట్లు ఉంది విపక్షాల పరిస్థితి. మొత్తంగా అధికార పార్టీ నేతలు టికెట్ ఎవరికి వస్తుందనే టెన్షన్ ఉంటే, విపక్ష నేతలు మాత్రం నాకు రాకపోయినా ఫర్వాలేదు ఆయనకు రాకూడదు అనుకుంటున్న పరిస్థితి కనిపిస్తుంది. ఈ గందరగోళం ఎక్కడ జరుగుతుందో తెలుసా ఏలూరులో.. ఇక్కడ రాజకీయాలకే రాజకీయం నేర్పగల ఉద్దండులు ఉన్నారు.ఏలూరు నియోజకవర్గంలో రాజకీయ పోరు ఏప్పుడు అధికార ప్రతిపక్షాల మధ్య నువ్వా నేనా అనే విధంగా సాగుతుంది. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే ఆళ్ల నానిని మార్చి కొత్త అభ్యర్థిని ఈసారి బరిలో నిలబెడతారనే ప్రచారం జరుగుతుంది. ప్రచారం ఎలా ఉన్నా సీఎం జగన్మోహన్ రెడ్డికి వీర విధేయుడు ఆళ్ల నాని. ఆయన కాదని వేరే వ్యక్తికి టికెట్టు ఇవ్వటం అంటే ఆడో మిరాకిల్ గానే స్థానికులు భావిస్తున్నారు. ఏలూరులో రెండున్నర లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. ముఖ్యంగా అందులో 60 వేలకు పైగా కాపు, తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన ఓట్లు ఉన్నాయి. గతంలో ఒకటి రెండు సార్లు మినహా ఏప్పుడు కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులే ఎమ్మెల్యేగా గెలుస్తున్నారు.గత ఎన్నికల్లో ఎంతోమంది ఏలూరు టిక్కెట్టును ఆశించినప్పటికీ ఎమ్మెల్సీగా ఉన్న ఆళ్ళ నానికే సీఎం జగన్ టికెట్ ఇచ్చి బరిలోకి దించారు. అయితే ఇటీవల పలుచోట్ల వైసీపీ అభ్యర్థుల మార్పుకు రంగం సిద్ధం చేసింది.

ఈ క్రమంలో ఇప్పటికే పలు నియోజకవర్ంగాల అభ్యర్థులకు మార్పులు చేర్పులు చేసి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే నానికి దీటుగా ప్రతిపక్షాలను ఎదుర్కొనే అంతస్థాయిలో ఉన్న అభ్యర్థులు ఉన్నారా అనే సందేహాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలోనే మాజీ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు ప్రముఖ పారిశ్రామికవేత్త మామిళ్ళపల్లి జయప్రకాష్ అలియాస్ జె పి పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. అయితే జేపీ కూడా నాని అనుచరుడే కావడం విశేషం.అప్పటి నుంచి నానితో సన్నిహిత సంబంధాలు దెబ్బతిన్నాయని పలువురు భావిస్తున్నారు. ఇక మరో నేత ఏలూరు మాజీ ఏఎంసీ చైర్మన్ మంచం మై బాబు. ఈయన కూడా నానికి వీర విధేయుడు. అయితే ఈసారి వైసీపీ అధిష్టానం తనను మార్చే ఆలోచనలో ఉంటే టికెట్ మై బాబుకు ఇవ్వాలని నాని కోరుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక జెపి తన శ్రీమతికి మేయర్ పదవి కోరినట్లు ప్రచారం జరుగింది. అది సాధ్యం కాకపోవటంతో నానికి జె జె పి కి మధ్య విభేదాలు వచ్చాయి. గతంలో ఒకటి రెండు సార్లు జెపి అలిగి నానికి దూరంగా ఉన్నారట. ఈ నేపథ్యంలోనే ఈసారి వీరిమధ్య గ్యాప్ బాగా పెరిగింది. అధిష్టానం దగ్గర జెపి తన పలుకుబడినంతా ఉపయోగిస్తున్నారట. ఇప్పటికిపుడు తన వెంట 6 నుంచి ఏడుగురు కార్పొరేటర్లు బయటకు వచ్చేసే విధంగా ఎత్తగడలు రూపొందించారని టాక్ వినిపిస్తుంది. తన కుటుంబ చరిత్ర , కాంగ్రెస్ నుంచి రాజకీయాల్లో తనకు వున్నా అనుభవం దృష్ట్యా పార్టీ టికెట్ తనకు ఇస్తుందని జెపి బాహాటంగానే ఆశిస్తున్నారు.అయితే ఇప్పటివరకు పోటీలో ఉంటానా లేదా అనే విషయంపై ఆళ్ల నాని స్పష్టత ఇవ్వకపోగా మౌనంగా వుండిపోయారు. అయితే తన మనుస్సులో ఏముందనేది బయటకు చెప్పకపోవటం ఆయనకు సహజంగా వున్నా




లక్షణం. అత్యంత సన్నిహితంగా వుండే వారితో సైతం నాని ఒకటి, రెండు మాటలు మాట్లాడి విషయాన్ని తేల్చేస్తారు. యువజన కాంగ్రెస్ లీడర్ గా రాజకీయ ప్రస్తానం మొదలు పెట్టిన నాని ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. తరువాత 2004 లో వై ఎస్ రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో నాని తొలిసారి శాసన సభలో అడుగుపెట్టారు. 2009 లోనూ గెలిచిన ఆయన వైఎస్ మరణం తరువాత చివరిగా జగన్ నాయకత్వంలో వైసీపీలో చేరారు. 2014 లో టికెట్ లభించినా, తెలుగు దేశం పార్టీ అభ్యర్థి బడేటి బుజ్జి చేతిలో ఓడిపోయారు.2017 లో ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆళ్ళ నాని ఆ పదవిలో ఉండగానే 2019లో తిరిగి అసెంబ్లీ కి పోటీ చేసి బుజ్జిపైనే గెలిచారు. సీఎం జగన్ తొలి కేబినెట్‌లో ఉపముఖ్యమంత్రిగా, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. రొటేషన్ కోసం మంత్రి పదవిని వదులుకోవలసిన సందర్భంలో నాని తీవ్రంగా మనస్థాపానికి గురైనట్లు చెబుతారు ఆయన సన్నిహితులు. చాలాకాలం బయటకు రాకపోవటం, కేవలం సమీక్షలకు పరిమితం కావటం, ఈలోగా మిగిలిన నేతలు అధిష్టానానికి లోకల్ విషయాలు చేరవేయడంలో విజయవంతం కావటంతో నానికి మైనస్‌గా మారిందట. ఇది తనకు వీరవిధేయులుగా వున్నవారు సైతం టికెట్ ఆశించే స్థాయికి చేరుకుందట. అయితే 2024 ఎన్నికల్లోనూ నేను బరిలో ఉంటానని నాని స్పష్టంగా తన అంతరంగికుల వద్ద చెబుతున్నారు. ఆయనే నిలబడితే కొందరు వెనక్కు తగ్గుతారు. కానీ అయన కాకుండా మరొకరు ఉంటే విపక్షంలోనూ నేతలు మరి పోటీలో వుండే అభ్యర్దుల పేర్లు మారిపోయేంతగా ఏలూరు రాజకీయంమారిపోతుంది అని ప్రచారం జరుగుతుంది.మరోవైపు పలు రకాల సందేహాలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికలంటే ఒక్క అభ్యర్థి విషయమే కాదు ఆర్థికంగా వారి బలాబలాలను సైతం లెక్కలోకి తీసుకుంటారట. ఈ క్రమంలో జెపి ఆర్థికంగా కాస్త బలమైన వ్యక్తి కావడంతో ఆయనకే సైతం టిక్కెట్టు దక్కుతుందనే ప్రచారం కూడా జరుగుతుంది. అయితే నానినీ కాదని జెపికి టికెట్ ఇచ్చేందుకు వైసీపీ సిద్ధమైతే నాని ఖచ్చితంగా తన రాజనీతిని ప్రదర్శించకమన్నారు. తన అనుచరుల్లోనే ఒకరికి టికెట్ దక్కే విధంగా అయన వ్యవరిస్తారని చెప్పుకుంటున్నారు. ఇలాంటి వారిలో మంచెం మై బాబు పేరు ప్రచారంలో ఉంది. గతంలో ప్రజారాజ్యం లో మైబాబు చురుకుగా ఉన్నారు. వైఎస్ మరణం తరువాత నానితో పాటు పార్టీని విడి వైసీసీ లో చేరిపోయారు. అప్పటి కాంగ్రెస్ పెద్దలు మైబాబును బరిలో దింపేందుకు సైతం ప్రయత్నించారు. ఇలా తనకు ఉన్న బలం , పొలిటికల్ అనుభవంతో మై బాబు సైతం టికెట్ ఆశిస్తున్నా అది నాని కనుసన్నల్లో అయితేనే అవకాసం కనిపిస్తుంది. ఇక మరోవైపు 2019లో వైసీపీ టికెట్ మధ్యాహ్నపు బలరాం కుటుంభానికి దక్కుతుందని భావించారు. కానీ నాని పోటీ చేయటంతో బలరాం తన రాజకీయ గురువు కోటగిరి విద్యాధరరావు కుమారుడు శ్రీధర్ ముఖ్య అనుచరుడిగా ఉండిపోయారు. తరువాత ఏలూరు డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ పదవి దక్కినా ప్రస్తుతం ఆపదవిని మరొకరికి కట్టబెట్టడంతో బలరాం తీవ్ర అసంతృప్తి తో ఉన్నారు . ఆయన నానికి దూరంగా రాజకీయం నెరపుతున్న పరిస్థితి ఏలూరులో కనిపిస్తుంది.ఇక ఏలూరులో ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీ సైతం బలంగా ఉంది. ఈసారి జనసేనతో పొత్తు వారికి బాగా కలిసొచ్చే అంశం. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే ఆళ్ల నాని టీడీపీ అభ్యర్థి బడేటి బుజ్జిపై కేవలం 4 వేల ఓట్ల మెజారిటీతోనే గెలుపొందారు. 2019 ఎన్నికల అనంతరం గుండెపోటుతో బడేటి బుజ్జి మరణించడంతో ఏలూరు టీడీపీ ఇన్‌చార్జిగా ఆయన సోదరుడు బడేటి చంటి బాధ్యతలు చేపట్టారు. పార్టీ కార్యక్రమాలు జోరుగా ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో చంటి సక్సెస్ అయ్యారు. అయితే ఈసారి టీడీపీకి ఇక్కడ కొత్త చిక్కు వచ్చి పడింది. టీడీపీ ? జనసేన పొత్తులో భాగంగా ఏలూరు టికెట్‌ను జనసేన కోరుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. అంతేకాక గత ఎన్నికల్లో సైతం టీడీపీ ఓటమికి ఏలూరులో జనసేనే ప్రధాన కారణం అని పలువురు అభిప్రాయపడుతున్నారు. 2019 ఎన్నికల్లో జనసేన అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు పోటీలో ఉండి సుమారు 16 వేల ఓట్ల పైగా రాబట్టారు. టీడీపీ ఓట్లే భారీగా చీలి జనసేనకు పడ్డాయని, దాంతోనే ఇక్కడ ఆ పార్టీ అభ్యర్థి ఓటమిపాలయ్యారని టాక్ ఉంది.అయితే ఇక్కడ కాపు సామాజిక వర్గం ప్రభావం ఎక్కువ ఉండడంతో మొదటి ప్రాధాన్యతగా ప్రధాన పార్టీలు కాపు సామాజిక నేతల వైపే మొగ్గ చూపుతున్నారు. ఎందుకంటే అటు వైసిపి నుంచి ఎమ్మెల్యే ఆళ్ల నాని, జయప్రకాష్, మై బాబు , బలరాం అదేవిధంగా టీడీపీ ఇంచార్జ్ చంటి కాపు సామాజిక వర్గానికి చెందిన నేతలు. జనసేన ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన నేత. అంతేకాకుండా కార్మిక నాయకుడు కావడం ఆయనకు కలిసి వచ్చే అంశం. దాంతో ఇక్కడ రాజకీయం రసపట్టుగా మారింది. టీడీపీ జనసేన మధ్య ప్రస్తుత పరిస్థితి కాపు వర్సెస్ తూర్పు కాపుగా మారిపోయింది. జనసేన సైతం ఏలూరు టికెట్‌ను ఆశిస్తుంది. పొత్తులో భాగంగా జనసేనకు ఏలూరు టికెట్ ఇస్తే తప్పకుండా గెలిచి తీరుతామని జనసేన నేతలు భావిస్తున్నారు. అయితే టీడీపీ సైతం టికెట్ను వదులుకోవడానికి సిద్ధంగా లేదనే టాక్ వినిపిస్తోంది. జనసేన సపోర్ట్‌తో టికెట్‌ను టీడీపీకి ఇస్తే భారీ మెజారిటీతో గెలిచి తీరుతామని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బహిరంగంగా కాకపోయినా ఇక్కడ టీడీపీ ? జనసేనకు మధ్య అంతర్గతంగా టికెట్ వార్ నడుస్తుందట. ఎవరి ప్రయత్నాల్లో వారు జోరుగా పావులు కదుపుతున్నారట. ఏది ఏమైనా సరే ఫైనల్ గా అధిష్టాన నిర్ణయమే శిరోధార్యంగా భావించే అవకాశం ఉందని పలువురు నేతలు భావిస్తున్నారు.అయితే ఏలూరులో నువ్వా నేనా అనే ఎన్నికలు జరగనున్నాయి.. అధిష్టానం ఫోకస్ అంతా కాపు సామాజిక ఓటర్ల పైనే దృష్టి సారిస్తున్నారు. మెజారిటీ ఓట్లు ఆ సామాజిక వర్గానికి ఉండడంతో వారిని తమ పార్టీల వైపు ఆకర్షించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే వైసీపీలో ఉన్న అంతర్గత వర్గ పోరు నేపథ్యంలో నానికి టికెట్ ఇస్తే పూర్తిగా అసమ్మతి నేతలు పూర్తిగా సహకరిస్తారా?? లేక నాని అనుచరుడైన మై బాబు కి టికెట్ కేటాయిస్తే పరిస్థితి ఏంటి..? ఇప్పటికే వైసీపీకి చెందిన పలువురు ఆశావాహులు ఇతర పార్టీ నేతలతో టచ్ లో ఉన్నారని ప్రచారం నేపథ్యంలో ఎంతవరకు వైసీపీ విన్ అయ్యే అవకాశాలు ఉన్నాయో అర్థం కాని పరిస్థితి. ఇక జెపికి వైసిపి టికెట్ కేటాయిస్తే నాని వర్గం పూర్తిస్థాయిలో ఆయనకు సహకరించే అవకాశం లేదని బహిరంగంగానే ప్రచారం జరుగుతుంది. ఇక టీడీపీ జనసేన విషయానికి వస్తే.. ఎవరికివారు టికెట్టు దక్కించుకునే ప్రయత్నాల్లో ఉండి.. మరోపక్క అధిష్టానం నిర్ణయమే శిరోధారిమంటు తీరా పొత్తులో టీడీపీకి టికెట్ ఇస్తే జనసేన పూర్తి సహకారాలు అందిస్తుందా..? లేక జనసేనకే టికెట్ కేటాయిస్తే టిడిపి నేతలు జనసేనతో కలిసి వారి గెలుపునకు ఎంతవరకు సహకరిస్తారనేది నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాశంగా మారింది.

## కోడి పందాల కోసం విదేశీ పుంజులు



కాకినాడ, జనవరి 8,:దేశవాళీ కోడిపుంజులకు ధీటుగా ఈసారి కోడిపందాల బరిలో విదేశీ జాతులైన పెరు కోడిపుంజులను దింపుతున్నారు పందెం రాయుళ్లు. దేశవాళీ కోడిపుంజుతో పోలిస్తే విదేశీ జాతికి చెందిన పుంజులు అధిక పోరాట పటిమ కలిగి ఉంటాయని పందెం రాయుళ్ల చెబుతున్నారు. పెరు జాతులను ప్రత్యేకంగా ఎలా పెంచుతారు?వాటి పెంపకానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి.. దేశవాళీ కోడిపుంజుల పెంపకం మాదిరిగానే పెరు కోడిపుంజుల పెంపకం ఉంటుందా ?? మన వాతావరణ పరిస్థితుల్లో అవి ఎంతవరకు జీవించగలవు.. అనే విషయాలపై పందెం రాయుడు ఇప్పటికే సమగ్రంగా తెలుసుకున్నారు.దేశవాళీ కోడి పుంజులు 22 అంగుళాల ఎత్తు నుంచి 26 అంగుళాల ఎత్తు వరకు ఉండి నిటారైన ఆయన తోకతో పోడవాటి కాళ్లను కలిగి ఉంటాయి. కానీ పెరు జాతి కోడిపుంజు 16 నుంచి 20 అంగుళాల ఎత్తు మాత్రమే ఉండి తోక భూమికి వంగి ఉండటంతో పాటు ఆకారంలో పోలిస్తే దేశవాళీ కోడిపుంజు కన్నా పెరు జాతి కోడిపుంజు చిన్నదిగా ఉంటుంది. అయితే బలాల విషయానికొస్తే పెరు కోడిపుంజు కన్నా దేశవాళీ కోడిపుంజే బలిష్టంగా ఉంటుందని పందెం రాయుళ్లు చెబుతున్నారు. కానీ పోరాట పటిమ విషయానికి వస్తే పెరు జాతి కోడిపుంజు స్పీడుగా పోటీలో దింపిన వెంటనే ప్రత్యర్థి కోడి పుంజుపై వేగంగా వెళ్లి తన పోరాట పటిమను కనబరుస్తుంది. అంతేకాక ఆకారంలో చిన్నగా ఉండటం, బరువు తేలికగా ఉండటంతో పందెంబరిలో ప్రత్యర్థి కోడిపుంజుకు చిక్కకుండా పోరాడి విజయాన్ని సాధిస్తుంది. దాంతో ఇటీవల ఎక్కువగా పందెం రాయుళ్లు సంక్రాంతి కోడి పందాల కోసం పెరు కోడి పుంజులనే ఇష్టంగా పెంచుతున్నారు.ఇక ప్రత్యేకంగా సిద్ధం చేసిన పందెం పుంజులతో పందెం రాయళ్లు ఇప్పటికే పందాల కోసం సిద్ధమయ్యారు. అయితే ఈసారి పందెం పుంజుల ధరలు కూడా ఆకాశాన్ని అంటాయి. ప్రత్యేకంగా తయారుచేసిన పందెం పుంజు ధర ప్రస్తుతం సుమారు ఒక లక్ష రూపాయల నుంచి ఐదు లక్షల వరకు పలుకుతుంది. అయితే పందాలు కూడా అంతే స్థాయిలో జరుగుతుతాయి. ఒక్కొక్క కోడి పందాన్ని తలపడే కోడిపుంజులను బట్టి లక్ష రూపాయలు నుంచి 50 లక్షల వరకు పందేలు కడతారు. పందాలలో తలపడే పందెం కోళ్లు ప్రత్యేక తయారీకి ఒక్కొక్క కోడికి సుమారు 25 వేల నుంచి 50 వేల వరకు ఖర్చవుతుంది. ఇక విదేశీ కోళ్లకైతే ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయడంతో మరింత ఖర్చు ఎక్కువవుతుంది. ఎందుకంటే వాటి పెంపకానికి తగిన వాతావరణ పరిస్థితులు కల్పించడానికి మరింత అదనంగా ఖర్చవుతుంది. ఈ పందాలు ఒక్క గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే కాకుండా పట్టణంలో నివసించేవారు, సినీ రాజకీయ ప్రముఖులు సైతం ఎక్కువగా పాల్గొనడంతో కోడిపందాలపై ఎంతో క్రేజ్ పెరిగిపోయింది.పందెం రాయుళ్లు పుంజులను బట్టి, జాతిని బట్టి, రంగును బట్టి, కొందరైతే నక్షత్రాలను బట్టి సైతం పెద్ద ఎత్తున పందేలు కాస్తుంటారు. పండగ మూడు రోజులు ఒక ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మారు 250 నుంచి 300 కోట్ల రూపాయలు చేతులు మారుతాయి అని అంచనా వేస్తున్నారు. ఓ పక్క పందాల బరిలో కోడిపందాలతో పాటు గుండాట, పేకాట జోరుగా సాగుతాయి. అంతేకాకుండా కోడిపందాల వీక్షణ కోసం వచ్చే పందెం రాయుళ్ల కోసం బరుల వద్ద ప్రత్యేకమైన వంటకాలు, రకరకాల ఆహార పదార్థాలు అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా పందెంబరుల వద్ద కోజా మాంసాన్ని ఎక్కువగా తింటారు. పందెంలో ఓడిపోయిన పుంజుని కోజా అంటారు. అలాంటి కోజా పుంజులతో ప్రత్యేక వంటకాలు చేస్తారు.

# కోనసీమలో పార్టీల కాక..

కాకినాడ, జనవరి 8,: స్వాతంత్ర్య సమరయోధుడు కళా వెంకట్రావు ప్రాతినిథ్యం వహించిన కొత్తపేట నియోజకవర్గానికి అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే ఓ ప్రత్యేకత ఉంది.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాక 1955లో కొత్తపేట నియోజకవర్గం ఏర్పడింది. అప్పటినుంచి ఎక్కువ సార్లు కాంగ్రెస్ పార్టీ గెలుపొందుతూ రాగా 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపొందుతూ వస్తోంది.. కొత్తపేట నియోజకవర్గంలో చిర్ల కుటుంబం నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండగా టీడీపీ నుంచే చిర్ల సోమసుందర రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరి మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నిక య్యారు. ప్రస్తుతం ఆయన కుమా రుడు చిర్ల జగ్గిరెడ్డి 2004లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యి 2014, 2019లో వైసీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు.. ఇటీవల భరోసా యాత్రలో భాగంగా రావులపాలెంలో నిర్వహించిన బహిరంగ సభలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిర్ల జగ్గిరెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చిల్లర జగ్గిరెడ్డి అంటూ సంభోదిస్తూ ఇసుక దోపిడీ చేస్తున్నారంటూ, కాంట్రాక్టులు తీసుకుని దోచేస్తున్నారని, భూ కజ్జాలు చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు.. 2014, 2019 ఎన్నికల్లో తిరుగు లేని విజయాన్ని సంపా దించిన జగ్గిరెడ్డి మరోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనేపథ్యంలోనే ఏది ఏమైనా ఈ సారి ఎన్నికల్లో వైసీపీని ఓడించాలన్న లక్ష్యంతో టీడీపీ, జనసేన పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి.. ఇప్పటికే టీడీపీ తరపున నియోజకవర్గ ఇంచార్జ్ బండారు సత్యానందరావు, జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావులు పోటాపోటీగా ఈసారి గెలుపు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.. అయితే ఈసారి టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ఏపార్టీ పోటీచేస్తుందో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. అయితే ఎవ్వరికి వారు తమ పని తాము చేసుకుపోతూ ప్రజల్లో తమ గెలుపు కోసం ప్రయత్నిస్తున్నారు..వైసీపీ గెలుపు కోసం ప్రభుత్వ విప్, కొత్తపేట సిట్టింగ్ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ముచ్చటగా మూడోసారి కూడా గెలుపు ద్వారా హ్యాట్రిక్‌ను సాధించాలని చిర్ల తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారట.. ఇందుకోసమే వైసీపీకు సాంప్రదాయ ఓటింగ్‌గా ఉన్న ఎస్సీ, బీసీ ఓటర్లతో నిరంతరం టచ్‌లో ఉంటూ చెక్కుచెదరని ఓటుబ్యాంకుతో విజయం సాధించాలని పట్టుదలతో పనిచేసుకుపోతున్నారన్న ప్రచారం సాగుతోంది.. అయితే రావులపాలెంలో చోటుచేసుకున్న పలు వివాదాలు, అట్రాసిటీ కేసులు నమోదు కాకుండా మోకాలడ్డారన్న ఆరోపణలు ఎస్సీ సామాజిక వర్గాన్ని కొంత వరకు చిర్ల జగ్గిరెడ్డికి దూరం చేశాయన్న మాటలు వినిపిస్తున్నాయి.. ముఖ్యంగా అంబేద్కర్ చిత్రపటంతో ఉన్న పేపర్ ప్లేట్స్ వివాదంలో ఓ వర్గానికి కొమ్ముకాసి దళిత యువకులను తిరిగి జైల్లో పెట్టించారని ఆరోపణలు చిర్లపై తీవ్రంగా ఉన్నాయి.. ఇదే సమయంలో కాపు సాసమాజిక వర్గాన్ని కాపు కాసుకుంటూ అదే సమయంలో ఎస్సీ వర్గీయుల్లో పట్టుసాధించాలన్న పట్టుదలతో బండారు సత్యానందరావు నిమగ్నమయ్యారన్నది కూడా వినిపిస్తోంది. ఇదే ప్రాంతానికి చెందిన శాసన మండలి మాజీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఆయన సతీమణి కూడా కోనసీమ ప్రాంతంలో టీడీపీ నుంచి కీలకంగా పనిచేస్తున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన సుబ్రహ్మణ్యం ద్వారా కూడా బీసీ వర్గం నుంచి టీడీపీకు అనుకూల ఓటు బ్యాంకు లభిస్తే ఇక టీడీపీ, జనసేన పొత్తుతో విజయం తథ్యం అన్న ధీమాతో రెండు పార్టీలు ఉన్నట్లు తెలుస్తోంది.. కొత్తపేట నుంచి శాసన సభకు ప్రాతినిథ్యం వహించిన వారి జాబితా పరిశీలిస్తే.. 2004లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన చిర్ల జగ్గిరెడ్డి టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావుపై 2,271 ఓట్లు మెజారిటీతో గెలుపొందారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భాంతో ఇక్కడ ముక్కోణపు పోటీ జరిగింది. పీఆర్పీ నుంచి బండారు సత్యానందరావు, కాంగ్రెస్ నుంచి చిర్ల జగ్గిరెడ్డి, టీడీపీ నుంచి రెడ్డి సుబ్రహ్మణ్యం లు తలపడ్డారు. ప్రజారాజ్యం నుంచి పోటీచేసిన బండారు సత్యానందరావు జగ్గిరెడ్డిపై 2,470 ఓట్లుతో గెలుపొందారు.. 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన సత్యానందరావుపై చిర్ల జగ్గిరెడ్డి 713 ఓట్లుతో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సత్యానందరావు, జనసేన అభ్యర్థి బండారు శ్రీనివాసరావులపై 4,038 ఓట్లు మెజార్టీ సాధించిన జగ్గిరెడ్డి విజయం సాధించారు. మొత్తం 2004 నుంచి పరిశీలిస్తే కొత్తపేటలో ఏ పార్టీకు అయినా స్వల్ప మెజార్టీ మాత్రమే లభిస్తుందన్నది తెలుస్తుంది.

